మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 4-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 305 Issue: 305

Circulated to Telangana
Published from Jagitial

04 మే 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:52 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి తదియ తె. 5:250 వరకు తరువాత చవితి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం అనురాధ ఉ. 9:51 వరకు తరువాత జ్యేష్ఠ యోగం పరిఘ రా. 11:13 వరకు కరణం వనిజ సా. 4:13 వరకు విష్టి తె. 5:250 వరకు వర్జ్యం సా. 4:14 నుండి సా. 6:02 వరకు దుర్ముహూర్తం మ. 12:38 నుండి మ. 1:29 వరకు మ. 3:10 నుండి సా. 4:01 వరకు రాహుకాలం ఉ. 7:27 నుండి ఉ. 9:02 వరకు యమగండం ఉ. 10:37 నుండి మ. 12:13 వరకు గుళికాకాలం మ. 1:48 నుండి మ. 3:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:16 నుండి తె. 5:04 వరకు అమృత ఘడియలు తె. 3:00 నుండి తె. 4:48 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

# దొంగలొచ్చారు.. దోచుకుపోయారు!

## పట్టపగలే సినీఫక్కీలో దొంగల దోపిడీ

ఆదివారం ఉదయం 10.45 గంటలు.. కరీంనగర్ జ్యోతినగర్‌లోని పీఎంజే జ్యువెలీ సిబ్బంది షాపును తెరిచారు.. నగలను లాకర్ల నుంచి తీసుకొచ్చి డిస్ప్లేలో పెడుతున్నారు. ఒక్కొక్కరిగా కస్టమర్లు షాపుకు వస్తున్నారు. వారితో పాటే ఓ దొంగ కూడా ఎంటర్ అయ్యాడు. కస్టమర్‌లా నగలను పరిశీలించాడు. లోపల పరిస్థితి అంతా కంట్రోల్‌లోనే ఉందని గ్రహించాడు. తనతో పాటు వచ్చి, బయట కాచుకొని కూర్చున్న నలుగురు తోటి దొంగలను అలర్ట్ చేశాడు. అంతే.. ఒక్కసారిగా వారంతా జ్యువెలరీ షాపులోకి వచ్చి తుపాకులతో బెదిరించి అక్కడున్న నగలను బ్యాగుల్లో నింపుకున్నారు. అడ్డుకొనేందుకు ప్రయత్నించిన సిబ్బందిపై 7-8 రౌండ్ల కాల్పులు జరిపి పరార్ అయ్యారు. అచ్చం ఓ సినిమా స్టోరీని తలపించేలా జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.



ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

TELANGANA STATE POLICE
KARIMNAGAR POLICE

ఈ ఫోటోల్లో కనిపిస్తున్న వ్యక్తులు కరీంనగర్‌లోని ఒక బంగారు దుకాణంలో దోపిడీకి పాల్పడ్డారు.



వారి గురించి ఏమైనా సమాచారం తెలిసినచో, వెంటనే పోలీసులకు తెలియజేయాలి.

సమాచారం అందించిన వారికి ₹1,00,000/- బహుమతిగా ఇవ్వబడుతుంది.

సంప్రదించండి:
SHO, కరీంనగర్ 2 టౌన్: 8712670762
ACP, కరీంనగర్ టౌన్: 8712670711
SB కంట్రోల్, కరీంనగర్: 8712670713

అత్యవసర సహాయం కోసం: 100 కు డయల్ చేయండి.

మీ సమాచారం – ఒక ప్రాణాన్ని కాపాడొచ్చు, నేరాన్ని అడ్డుకోవచ్చు.
మేము మీ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాము.
మీ సహకారం – సురక్షిత సమాజానికి మా బలం

## కరీంనగర్ పీఎంజే జ్యువెలరీ షాపులో ఘటన

### సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు.. కిలోలకొద్దీ ఆభరణాలతో బైకులపై పరార్

### ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు.. బండి సంజయ్ ఇంటికి సమీపంలో ఘటన

### శాంతిభద్రతలపై ప్రతిపక్షాల మండిపాటు

కరీంనగర్, మే 3 (ఈవార్తలు): కరీంనగర్ నగరం తుపాకుల మోతతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అత్యంత రద్దీగా ఉండే పట్టణం లోని పీఎంజే జ్యువెలరీ షాపులో భారీ దోపిడీ జరిగింది. పథకం ప్రకారం రెండు బైకులపై వచ్చిన ఐదుగురు సాయుధ దుండగులు.. సినిమా ఫక్కీలో షోరూమ్‌లోకి చొరబడి సిబ్బందిని తుపాకులతో బెదిరించారు. దోపిడీని అడ్డుకునేందుకు ప్రయత్నించిన సిబ్బందిపై దుండగులు ఏమాత్రం కనికరం లేకుండా కాల్పులు జరిపారు. ఈ విచక్షణారహిత కాల్పుల్లో దుకాణానికి ముగ్గురు సిబ్బంది తీవ్ర గాయాలపాలయ్యారు. కాల్పుల అనంతరం దుండగులు షోరూమ్ కౌంటర్లలో ఉన్న విలువైన బంగారు, వజ్రాభరణాలను బ్యాగుల్లో నింపుకుని బైకులపై అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న కరీంనగర్ కమిషనర్ సహా ఉన్నతాధికారులు బలగాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. షోరూమ్‌లోని సీసీటీవీ కెమెరాల్లో దుండగుల కదలికలు రికార్డయ్యాయి. హెల్మెట్లు ధరించిన నిందితులు ఏ భాషలో మాట్లాడారు ? వారు ఎటువైపు నుంచి వచ్చారు ? అనే కోణంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. దోచుకెళ్లిన నగలు కిలోల సంఖ్యలో ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నప్పటికీ వాటి పూర్తి విలువను షోరూమ్ యాజమాన్యం ఇంకా నిర్ధారించాల్సి ఉంది. నిందితులు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ముఠా సభ్యులా? అన్న కోణంలోనూ అనుమానాలు తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,044 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,902 |


# విజేత ఎవరో?

## నేడే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలు.. ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి



ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు ఆఖరి అంకానికి చేరుకున్నాయి. సోమవారం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడికి ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కేరళం, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానుంది.

న్యూఢిల్లీ: ఆయా రాష్ట్రాల్లో ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. దీంతో ఎన్నికల ఫలితాలపై సర్వ త్రా ఉత్కంఠ నెలకుంది. నేటి మ ధ్యాహ్నంలోగానే ఫలితాలపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. పశ్చిమబెంగాల్ మినహా మిగిలిన అన్ని చోట్ల ఒకే దశలో ఎన్నికలను నిర్వహించారు. బెంగాల్లో మాత్రం రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. రెండో విడతలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో అనేక చోట్ల శనివారం రీపోలింగ్ నిర్వ హించారు. ఇక ఫల్తా నియోజకవర్గం యావత్తు రీపోలింగ్ కు ఇసి అసాధారణ ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా తరువాయి 2 వ పేజీలో...



# కేబినెట్ విస్తరణ లేట్?

## రెండు ఖాళీల్లో ఒకటి ఎస్టీలకు

## పలువురు మంత్రులకు ఉద్వాసన

## కొత్త వారికి చాన్స్ దక్కే అవకాశం

హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): రాష్ట్రంలో మంత్రి వర్గంలో మార్పులు, కొత్త వారికి అవకాశం కల్పించడంపై కొనసాగుతున్న సస్పెన్స్.. మరికొన్ని రోజులు సాగనుంది. త్వరలోనే తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ, ప్రక్షాళన ఉంటుందనే వార్తలు వస్తున్న వేళ.. అది ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం 5 రాష్ట్రాల ఎన్నికలు పూర్తి కాగా.. సోమవారం ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఈ నేపథ్యంలోనే కేరళలో కాంగ్రెస్ తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




2011కు ముందు రష్యాలో బీర్ కూడా నాన్ ఆల్కాహాలిక్ పానీయమే. అక్కడి చట్టాల ప్రకారం 10 శాతం కంటే తక్కువ ఆల్కాహాల్ ఉన్న పానీయాలన్నీ సాఫ్ట్ డ్రింక్ పరిధిలోకి వస్తాయి. అయితే, అదే సంవత్సరం జూలైలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చి బీర్‌ను ఆల్కాహాలిక్ గ్రూప్‌లో చేర్చారు.

# ఆస్తి వివాదం.. ఇంట్లోనే బొంద తవ్వి!

## మృతదేహం చుట్టూ ఆస్తి పంపకాల గొడవ.. జగిత్యాలలోని వంజరివాడలో అమానవీయం



జగిత్యాల బ్యూరో, మే 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా వంజరివాడలో ఆస్తి వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అనారోగ్యంతో మాధురి అనే మహిళ మృతి చెందగా.. ఆమె మృతదేహాన్ని కేంద్రంగా చేసుకుని కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మృతురాలి భర్త రాజు మూడేళ్ల క్రితమే మరణించగా.. ప్రస్తుతం ఆస్తి విషయంలో విభేదాలుతరువాయి 2 వ పేజీలో...



# ఏసీ పేలి 9 మంది సజీవ దహనం!?

## ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఆదివారం తెల్లవారుజామున ఘోర విషాదం చోటుచేసుకుంది. తూర్పు ఢిల్లీలోని సంపన్న ప్రాంతమైన వివేక్ విహార్‌లోని ఒక నాలుగు అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఏడాదిన్నర పసికందుతో సహా మొత్తం తొమ్మిది మంది సజీవ దహనం తరువాయి 2 వ పేజీలో...



# కోడికి ఎండ మంట


## వేసవి దెబ్బకు భారీగా రేట్లు

హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో కోళ్ల ఫారాల్లో కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. దీనివల్ల మార్కెట్‌కు కోళ్ల సరఫరా గణనీయంగా తగ్గింది. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు ధరలను భారీగా

# వడగాల్పులకు బ్రేక్!

## తెలంగాణ ప్రజలకు చల్లని కబురు

## నేటి నుంచి వాతావరణ మార్పులు



హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): తెలంగాణలో ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఊరటనిచ్చే వార్తను చెప్పింది. గత కొన్ని వారాలంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే సోమవారం నుంచి రాష్ట్రంలోని వాతావరణంలో తరువాయి 2 వ పేజీలో...

# నార్త్ ఆర్ఆర్ఆర్‌కు లైన్ క్లియర్

## రూ.23,935.60 కోట్ల బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం

## టెండర్లు తెరిచి నిర్మాణాన్ని ప్రారంభించుకునే వీలు

## మొత్తం నిడివి 161.518 కి.మీ... 2 ప్యాకేజీలుగా పనులు

## 100 నుంచి 90 మీటర్ల వెడల్పునకు అలైన్‌మెంటు తగ్గింపు

## మూడేళ్లలో నిర్మాణం పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఏఐకి ఆదేశం

# రాశి ఫలాలు

4.5.2026

మేషం: కొన్ని వ్యవహారాలలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి సమస్యలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులు సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో భాగస్వామితో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగాలలో ఆశించిన హోదాలు పొందుతారు.

వృషభం: ప్రముఖుల నుంచి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. నూతన వస్తు వాహన లాభాలు ఉన్నాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణిస్తాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు అధిగమిస్తారు.

మిధునం: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన శ్రమాధిక్యత పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. మిత్రులతో ఊహించని మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఇంటా బయట ఆలోచనలు అంతగా కలిసి రావు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. వ్యాపారాలు సమర్ధవంతంగా నిర్వహించలేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి తప్పదు.

సింహం: సన్నిహితులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరపు బంధువుల నుండి ఆసక్తికర సమాచారం అందుతుంది. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయి. ఉద్యోగాలలో నూతనోత్సాహంతో పని చేసి ప్రశంసలు అందుకుంటారు.

కన్య: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు ఉంటాయి. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి పెరుగుతుంది. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహారించాలి.

తుల: చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

వృశ్చికం: వృధా ఖర్చులు పెరుగుతాయి. బంధువులతో స్వల్ప మాట పట్టింపులుంటాయి. ప్రయాణాలు ఆకస్మికంగా వాయిదా పడుతాయి. వృత్తి వ్యాపారాలలో కొంత గంధరగోళ పరిస్థితులుంటాయి. ఇంటా బయట పరిస్థితులు అంతగా అనుకూలించవు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి.

ధనస్సు: స్థిరాస్తి వ్యవహారాలలో చికాకులు తొలగుతాయి. చేపట్టిన పనులు చకచకా పూర్తి అవుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో నూతన వ్యూహాలతో ముందుకు సాగుతారు. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా చేస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

మకరం: కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

కుంభం: ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. నూతన వ్యాపార పెట్టుబడుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. ఒత్తిడి అధికమైన నిదానంగా పనులు పూర్తి చేస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగాలు కొంత నిరాశ కలిగిస్తాయి.

మీనం: నూతన ఋణ ప్రయత్నాలు అంతగా అనుకూలించవు. కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా చికాకు కలిగిస్తుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. దూరప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగాలలో సమస్యలు అధికమవుతాయి

# దొంగలొచ్చారు..దోచుకుపోయారు!

మొదటి పేజీ తరువాయి

వ్యక్తమవుతున్నాయి. నగరంలోని అన్ని సరిహద్దుల వద్ద పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కాగా, కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటికి అతి సమీపంలో ఈ ఘటన జరగడం గమనార్హం. ఆ ప్రాంతంలో బండి సంజయ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, అప్పటివరకు పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## దొంగలను పట్టిస్తే రూ.లక్ష బహుమతి

చోరీని తీవ్రంగా పరిగణించిన కరీంనగర్ పోలీసులు.. నిందితులను పట్టుకునేందుకు అన్ని చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఐదుగురు నిందితుల ఫోటోలను రిలీజ్ చేసిన పోలీసులు.. వారిని పట్టించిన వారికి రూ.1 లక్ష ఇస్తామని తెలిపారు. ఈ కాల్పులు, చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు.. నగరంలో ఉన్న సీసీటీవీలు అన్నింటినీ జల్లెడ పడుతున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. నిందితులకు సంబంధించిన ఫోటోలను మీడియా, సోషల్ మీడియాతోపాటు ఫ్లెక్సీలు, పోస్టర్ల ద్వారా బాగా వైరల్ చేస్తున్నారు. ఈ దొంగల ఫోటోలను రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లకు పంపించారు. వీరిని పట్టుకునేందుకు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీసులు కూడా అలర్ట్ అయి.. దొంగలను పట్టుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికైనా ఈ దొంగల సమాచారం తెలిస్తే డయల్ 100 , కరీంనగర్ 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ 8712670762.. కరీంనగర్ టౌన్ ఏసీపీ 8712670711.. కరీంనగర్ ఎస్పీ కంట్రోల్ 8712670713 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని పోలీసులు సూచిస్తున్నారు. దొంగల సమాచారాన్ని అందించిన వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## పట్టుకుంటాం: కరీంనగర్ సీపీ

దోపిడీ కేసు వివరాలను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మీడియాకు వెల్లడించారు. ఐదుగురు తుపాకులతో ప్రవేశించారని తెలిపారు. బంగారం కొనుగోలు చేస్తున్నట్లు ప్రవర్తించి తుపాకులతో బెదిరించారని పేర్కొన్నారు. వారిలో నలుగురు నాలుగు రౌండ్లు ఫైరింగ్ చేశారని చెప్పారు. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది గాయపడ్డారని అన్నారు. దోపిడీ తర్వాత వెపన్స్‌ను వారి వెంటనే తీసుకెళ్లారని వివరించారు. దోపిడీకి సంబంధించి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నామని సీపీ తెలిపారు. నిందితులను కచ్చితంగా పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నామని చెప్పారు.



# నార్త్ ఆర్ఆర్ఆర్‌కు లైన్ క్లియర్

**రూ.23,935.60 కోట్ల బడ్జెట్‌కు కేంద్రం ఆమోదం**

**టెండర్లు తెరిచి నిర్మాణాన్ని ప్రారంభించుకునే వీలు**

హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. భారీ జాప్యం తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ ఆధీనంలోని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) ఉత్తర భాగం బడ్జెట్‌కు ఆమోదముద్ర వేసి, అనుమతులు మంజూరు చేసింది. దీంతో దాదాపు 8 నెలలుగా పెండింగులో ఉన్న టెండర్లను తెరిచేందుకు మార్గం సుగమం అయ్యింది. భూసేకరణ ప్రక్రియ పూర్తయినప్పటికీ, రోడ్డు నిర్మాణానికి వీలుగా ఎలాంటి పురోగతి లేక ప్రాజెక్టు దాదాపు ఏడాదిగా పెండింగులో ఉంది. తొలుత రూ.15 వేల కోట్లతో 161.518 కి.మీ. నిడివితో ఉత్తర భాగాన్ని నిర్మించనున్నట్టు అంచనాలు రూపొందించినప్పటికీ, తాజాగా పీపీపీఏసీ ఏకంగా రూ.23,935.60 కోట్ల బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేసింది. అంటే అంచనాలు దాదాపు రూ.9 వేల కోట్ల మేర పెరిగిపోయాయి. కాగా మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంది. ఒకవేళ జాప్యం జరిగితే ఈ అంచనా మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన పరిశీలిస్తే దక్షిణ భాగం నిర్మాణానికి రూ.35 వేల కోట్ల వ్యయమయ్యే అవకాశం కన్పిస్తోంది. దక్షిణ భాగం విషయంలో ఇంకా అలైన్‌మెంటు కూడా ఖరారు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం 208 కి.మీ.తో ఓ అలైన్‌మెంటును రూపొందించినా, ఎన్‌హెచ్‌ఏఐ దాన్ని పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అది ఖరారై డీపీఆర్ సిద్ధమైతే వ్యయంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం మొత్తం నిడివి161.518 కి.మీ.లు. తొలుత 8 వరసలతో నిర్మించాలని భావించినప్పటికీ, 6 వరసలకే ప్రస్తుతం కేంద్రం పరిమితం చేసింది. దీనిని రెండు ప్యాకేజీల్లో నిర్మించనున్నారు. ప్యాకేజీ-1 కింద సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ వరకు (83.518 కి.మీ) నిర్మిస్తారు. ప్యాకేజీ-2 కింద ప్రజ్ఞాపూర్ నుంచి యాదాద్రి-భువనగిరి జిల్లా తంగేడ్‌పల్లి గ్రామం వరకు (78 కి.మీ.లు) వరకు నిర్మిస్తారు.

## 90 మీటర్ల వెడల్పే..

తొలుత 8 వరసల రోడ్డుగా ప్రతిపాదించడంతో ఎన్‌హెచ్‌ఏఐ 100 మీటర్ల వెడల్పుతో అలైన్‌మెంటును రూపొందించి, 1,933 హెక్టార్ల భూమి కావాలని ప్రతిపాదించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు భూమిని అప్పగించింది. తర్వాత రోడ్డును 6 వరసలకే కుదించటంతో, ఇప్పుడు 90 మీటర్ల వెడల్పు అలైన్‌మెంటు సరిపోతుందని కేంద్రం తేల్చింది. మిగిలే 10 మీటర్ల అలైన్‌మెంటు భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వ వినియోగానికి అప్పగించాలని నిర్ణయించింది. ఉత్తర భాగం కోసం పీపీపీ, బీఓటీ నిర్మాణ పద్ధతులను పరిశీలించి చివరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ను ఎంపిక చేశారు. కేంద్రం 40% నిధులు నిర్మాణ సంస్థకు చెల్లించనుండగా, 60% నిధులను నిర్మాణ సంస్థ సమకూర్చుకోనుంది. నిర్మాణ సంస్థతో 15 ఏళ్ల కాలానికి ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పందం చేసుకుంటుంది. ఆ సంస్థ ఖర్చు చేసిన 60% నిధులను వడ్డీతో సహా వాయిదాల పద్ధతిలో చెల్లిస్తుంది.

# కోడికి ఎండ మంట

మొదటి పేజీ తరువాయి

పెంచేశారు. గత వారంతో పోలిస్తే కేజీ చికెన్‌పై దాదాపు రూ. 20 నుండి రూ. 40 వరకు అదనపు భారం పడింది. ఎండల తీవ్రత తగ్గే వరకు ఈ పరిస్థితి ఇలాగే ఉండే అవకాశం ఉందని పౌల్ట్రీ యజమానులు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ నగరాల్లో ధరలు భిన్నంగా ఉన్నాయి. ఏపీలోని శ్రీకాకుళం, పిఠాపురం వంటి ప్రాంతాల్లో చికెన్ ధర కేజీ రూ. 300 మార్కును తాకింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, గుంటూరు, రాజమండ్రి వంటి నగరాల్లో రూ. 270 వరకు విక్రయిస్తున్నారు. ఇక తెలంగాణ విషయానికొస్తే, హైదరాబాద్‌తో పాటు ప్రధాన జిల్లాల్లో ప్రాంతాన్ని బట్టి రూ. 260 నుండి రూ. 280 మధ్య ధరలు పలుకుతున్నాయి. స్కిన్‌లెస్ చికెన్ ధరలు కొన్ని చోట్ల ఇంకా ఎక్కువగా ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు చికెన్ కొనాలంటేనే వెనకాడుతున్నారు. ధరల పెరుగుదల ప్రభావం విక్రయాలపై స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ఆదివారాల్లో కిటకిటలాడే చికెన్ సెంటర్లు, ఇప్పుడు ధరల దెబ్బకు వెలవెలబోతున్నాయి. కేజీ కొనేవారు అరకేజీతో సరిపెట్టుకుంటున్నారు. మరోవైపు, కోళ్ల మేత ధరలు పెరగడం, రవాణా ఖర్చులు అధికమవ్వడం కూడా ఈ ధరల పెరుగుదలకు పరోక్ష కారణాలుగా మారుతున్నాయి. వేసవి గడిస్తే తప్ప చికెన్ ధరలు మళ్ళీ సాధారణ స్థితికి వచ్చేలా లేవు.

# ఆస్తి వివాదం.. ఇంట్లోనే బొంద తవ్వి!

మొదటి పేజీ తరువాయి

తీవ్రరూపం దాల్చాయి. రాములు, శారద దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. రాములు గతంలోనే మృతి చెందారు. భార్య మాధురి(40) కుమారుడు ధీరజ్‌తో కలిసి కరీంనగర్‌లోని సోదరుడి వద్ద ఉంటున్నారు. తాజాగా, మాధురి కూడా చనిపోయింది. అయితే, జగిత్యాలలోని ఆస్తిని కోడలికి కాకుండా కుమార్తెలకు ఇవ్వాలని శారద నిర్ణయించారు. శనివారం రాత్రి మాధురి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె సోదరులు ఆదివారం మృతదేహాన్ని జగిత్యాలలోని ఇంటికి తీసుకొచ్చారు. ఆస్తి ధీరజ్ పేరిట రాయాలంటూ ఆందోళనకు దిగారు. ఆస్తి ఇచ్చేందుకు అత్త నిరాకరించడంతో, మాధురి మృతదేహాన్ని ఇంట్లోనే పూడ్చిపెడతామని గుంత తవ్వారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. చివరికి ఆస్తిని మనవడికి రాసిచ్చేందుకు శారద అంగీకరించడంతో గొడవ కొలిక్కి వచ్చింది.

# విజేత ఎవరో?

మొదటి పేజీ తరువాయి

మారింది. ఇక్కడ ఈ నెల 21న రీపోలింగ్ నిర్వహించనున్నారు. 24న ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో బెంగాల్ పై ఇసి, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాయి. భారీ స్థాయిలో భద్రతను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 11 జిల్లాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఈ జాబితాలో ముర్షిదాబాద్, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, కూచ్ బెహార్, మాల్దా, నాడియా, బీర్‌భూం, పశ్చిమ మేదినీపూర్, హుగ్లీ వంటి జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి, ఫలితాలు వెలువడే సమయంలో అల్లర్లు జరగకుండా ఉండేందుకు అన్ని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. 75వేల మంది కేంద్ర పారామిలిటరీ దళాలను మోహరించిగా, బుల్లెట్లు, పేలుళ్లను తట్టుకోగల అధునాతన 'మార్ఫ్‌మ్యాన్' సాయుధ వాహనాలను రంగంలోకి దించారు.

# వడగాల్పులకు బ్రేక్!

మొదటి పేజీ తరువాయి

మార్పులు చోటు చేసుకుంటాయని.. తూర్పు తెలంగాణ జిల్లాల్లో సుదీర్ఘంగా కొనసాగుతున్న హీట్‌వేవ్ ముగియనుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.తూర్పు తెలంగాణ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడనుందని అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, హనుమకొండ, మహబూబాబాద్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో గాలి వేగం కూడా అధికంగా ఉండవచ్చునని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అయితే, హైదరాబాద్‌లో మే 6వ తేదీ నుంచి వర్షాల తీవ్రత మరింత పెరగనుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, స్థానిక వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎండల తీవ్రత తగ్గుముఖం పట్టడం వల్ల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

# ఏసీ పేలి 9 మంది సజీవ దహనం!?

మొదటి పేజీ తరువాయి

అయ్యారు. గాయపడిన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని గురు తేగ్ బహదూర్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో భవనంలోని రెండో అంతస్తులో మంటలు చెలరేగాయి. అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో మంటలు అంటుకోవడం తో.. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే అగ్నికీలలు మూడు, నాలుగో అంతస్తులకు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే 14 అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సుమారు రెండు గంటల పాటు శ్రమించి ఉదయం 6 గంటల సమయంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల వారు మరణించడం అందరినీ కలిచివేసింది. ముఖ్యంగా రెండో అంతస్తులో ఉన్న 60 ఏళ్ల అరవింద్ జైన్, ఆయన భార్య 58 ఏళ్ల అనిత, కుమారుడు 35 ఏళ్ల నిశాంత్, కోడలు 33 ఏళ్ల ఆంచల్, ఏడాదిన్నర వయసున్న మనుమడు అకాశ్ మంటల్లో కాలిపోయారు. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అలాగే మూడో అంతస్తులోని 50 ఏళ్ల నితిన్ జైన్, ఆయన భార్య 48 ఏళ్ల శైలీ, కుమారుడు 25 ఏళ్ల సమ్యక్ ప్రాణాలు కోల్పోయారు. వీరు మాత్రమే కాకుండా మొదటి అంతస్తులోని 40 ఏళ్ల శిఖా జైన్ మరణించగా.. ఆమె భర్త నవీన్ జైన్ గాయాలతో చికిత్స పొందుతున్నారు. మొత్తంగా 12 నుంచి 15 మందిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా కాపాడి ఆస్పత్రిలో చేర్చారు. ఆపై 9 మృతదేహాలను స్వాధీనం చేసుకుని వాటిని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అగ్నిప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. అయితే, ఎయిర్ కండీషనర్ (ఏసీ) పేలడం వల్లే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని స్థానికులు చెబుతున్నారు. 'ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. బహుశా ఏసీ పేలి ఉండవచ్చు.. ఆ వెంటనే భవనం మొత్తం పొగతో నిండిపోయింది' అని ఒక ప్రత్యక్ష సాక్షి మీడియాకు తెలిపారు. ఢిల్లీ పోలీస్ క్రైమ్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# కేబినెట్ విస్తరణ లేట్?

మొదటి పేజీ తరువాయి

కూటమి యూడీఎఫ్‌కు మెజార్టీ వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనాల మధ్య.. హస్తం పార్టీ హైకమాండ్.. అటు వైపు దృష్టి పెట్టనుంది. ఈ క్రమంలోనే తెలంగాణ కేబినెట్ విస్తరణ ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక కేబినెట్ విస్తరణలో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన వారికే కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోద ముద్ర వేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అదే సమయంలో ఇప్పటికే కేబినెట్‌లో ఉన్న పలువురు మంత్రుల వ్యవహార శైలిపై హైకమాండ్ అసంతృప్తితో ఉన్న నేపథ్యంలో వారిని తప్పించి.. కొత్తవారికి అవకాశం కల్పించే సూచనలు కూడా కనిపిస్తున్నాయి. ఇక ఇప్పటికే మంత్రివర్గంలో రెండు ఖాళీలు ఉండగా.. మంత్రులను తప్పిస్తే మరింత మందికి అవకాశాలు రానున్నాయి. ఇక ఇప్పటికే ఉన్న 2 ఖాళీల్లో ఒకటి ఎస్టీలకు కేటాయించే సూచనలు ఉన్నాయి. దీంతో బాలూ నాయక్, రామచంద్రు నాయక్ వంటి వారు ఆ కేటగిరీలో మంత్రి పదవి కోసం ఎదురుచూస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ పోస్టుకు గతేడాది రామచంద్రునాయక్‌ను కాంగ్రెస్ పార్టీ ఫైనల్ చేసినా అది అసెంబ్లీలో ఎంపిక జరగకపోవడంతో ఎటూ తేలలేదు. అంతేకాకుండా గత అసెంబ్లీ సమావేశాల్లో అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ ఆఫీసును రెడీ చేసినా ఆ ప్రక్రియ మాత్రం ముందుకు సాగలేదు. ఇక మిగిలిన సీటు కోసం ఎవరిని ఎంపిక చేస్తారనేది ఇప్పుడు తీవ్ర ఆసక్తికరంగా మారింది. కేబినెట్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడంతో వారికి అవకాశం దక్కుతుందనే ప్రచారం జరుగుతోంది. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు సలహాదారుగా కేబినెట్ మంత్రి హోదాలో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి ఉన్నారు. కేబినెట్ భేటీలకూ ప్రత్యేక ఆహ్వానితునిగా ఉన్నారు. ఆయనను కేబినెట్‌లోకి తీసుకోవాలనే ప్రయత్నం ఎప్పటినుంచో జరుగుతుండటంతో మళ్లీ ఆయన పేరు తెరపైకి వస్తోంది. ఇక అదే జిల్లాకు చెందిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మంత్రివర్గంలో స్థానం దక్కొచ్చనే ప్రచారం జరుగుతున్న వేళ.. తమ ఇద్దరి ఆధ్వర్యంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొనడం గమనార్హం. గతంలో వైఎస్-డీఎస్‌లాగా రేవంత్-మహేష్‌కుమార్‌గౌడ్ జోడి పని చేస్తుందని సీఎం పలు సభల్లో స్పష్టం చేశారు. దీంతో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ చీఫ్‌గానే కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ పార్టీకి అధికారం వచ్చినప్పటి నుంచి మంత్రి పదవిపై ఆశగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా రేసులో ఉన్నారు. ఈసారి ఆయన ఆశగా కూడా ఉన్నారు. అయితే కోమటిరెడ్డి బ్రదర్స్ విషయంలో హైకమాండ్‌దే ఫైనల్ నిర్ణయం కానుంది. మంత్రి పదవి కోసం చూస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు కేబినెట్ హోదాతో.. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చినా బాధ్యతలు చేపట్టలేదు. వీరితోపాటు.. మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు కేబినెట్‌లో చోటుకోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక ఇప్పటివరకు మంత్రులుగా ఉన్నవారిలో పలువురి పనితీరుపై కాంగ్రెస్ హైకమాండ్ అసంతృప్తితో ఉందని.. ఈ నేపథ్యంలోనే ఒకరిద్దరికి కేబినెట్ నుంచి ఉద్వాసన పలికి.. వారి స్థానంలో కొత్త వారిని తీసుకువస్తారనే చర్చ జరుగుతోంది. అదే జరిగిందే.. ఎవరినైతే తొలగిస్తారో.. అదే సామాజిక వర్గం నుంచి ఇంకొకరికి అవకాశం కల్పించనున్నారు. ఇక కీలక శాఖలు కూడా ఒకరి నుంచి మరొకరికి మార్చే అవకాశాలు కూడా ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. హోం మంత్రిత్వ శాఖను ఒక సీనియర్ మంత్రికి అప్పగించే అవకాశాలు ఉన్నాయని.. ఇతర శాఖల్లో కూడా కొన్ని మార్పులు, చేర్పులు ఉంటాయని తెలుస్తోంది. అయితే ఒక శాఖను మార్చితే.. దాన్ని సర్దుబాటు చేసేందుకు చాలా మార్పులు చేయాల్సి వస్తుందని.. అలా చేయడం వల్ల మరింత గందరగోళం తలెత్తుందనే భయాల నేపథ్యంలో ఆ ప్రయత్నం జరగకపోవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలోనే తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం దృష్టిపెట్టేందుకు కాస్త సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.

# సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్; మే 3 (ఈవార్తలు): తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘాటైన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని ఆయన హెచ్చరించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని కేటీఆర్ తన లేఖలో తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ. దీనివల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. ఇది నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే వెన్నుపోటు చర్య" అని కేటీఆర్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి గ్రహణం పట్టిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా సుమారు 10 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను చెల్లించలేదని, ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామంటే ఎవరూ నమ్మరని కేటీఆర్ అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో 2500కు పైగా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. నిధులు అడిగిన వారిని వన్-టైమ్ సెటిల్మెంట్, టోకెన్ల పేరుతో మభ్యపెట్టారని, నిరసన తెలిపితే విజిలెన్స్ దాడులతో బెదిరించారని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే గురుకులాల్లో 142 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ వేలాది మంది సరైన భోజనం లేక ఆసుపత్రుల పాలవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు 3.75 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు మాత్రం ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం దుర్మార్గం. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టి రైతులను దగా చేశారు. ఇప్పుడు ఫీజుల పథకానికి మంగళం పాడేందుకు దొడ్డిదారులు వెతుకుతున్నారు" అని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని కేటీఆర్ హెచ్చరించారు. "ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలి. లేదంటే 14 లక్షల మంది విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తాం. ఇప్పటికే రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. దీనికి విద్యార్థుల ఆగ్రహం కూడా తోడైతే ముఖ్యమంత్రి, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుంది" అని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## బండి సంజయ్, సీఎం రాజీనామా చేయాలి

**రాష్ట్రంలో శాంతిభద్రతలు సున్నా**

**బీఆర్ఎస్ నాయకుల మండిపాటు**

కరీంనగర్, మే 3 (ఈవార్తలు): కరీంనగర్‌జిల్లా కేంద్రంలోని బంగారు దుకాణంలో దొంగల బీభత్సంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శాంతి భద్రతల వైఫల్యం వల్ల కాల్పులు జరిగాయని ఆరోపించారు. బంగారు దుకాణంలో దొంగలు చొరబడి, కాల్పులు జరిపి నలుగురిని గాయపరచడం బాధకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆసుపత్రి బయట మీడియాతో వారు మాట్లాడారు. ఘటనకు కేంద్ర హోం మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని, కరీంనగర్ సీపీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో వందలాది సీసీ కెమెరాలను పెట్టి శాంతి భద్రతలను కాపాడామని తెలిపారు. సీసీ కెమెరాలు ప్రస్తుతం ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించారు. బాధితులకు ప్రభుత్వమే వైద్య సహాయం అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల పట్ల ప్రేమ లేదని ఆరోపించారు. దోపిడీకి ఇంటెలిజెన్స్ వైఫల్యం కారణమని ఆరోపించారు. అసెంబ్లీలో సైతం కరీంనగర్ శాంతి భద్రతలపై ప్రస్తావించానని అయినా పట్టించుకోవడం లేదని పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత తొలిసారి కరీంనగర్‌లో కాల్పులు ఘటన జరగడం దురదృష్టకరమని అన్నారు. కరీంనగర్ ఘటనలు పునరావృతం కాకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నిబంధనల పేరుతో రైతులకు ధోకా

**కాంగ్రెస్ సర్కారుపై హరీశ్ ధ్వజం**

సిద్దిపేట, మే 3 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు కానీ ఒక్క గింజ కూడా ప్రభుత్వం కొనడం లేదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మల్లారం వద్ద సిద్దిపేట-కరీంనగర్ రాజీవ్ రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. రైతులకు సంఘీభావంగా హరీశ్‌రావు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 28 రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదంటూ రైతులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. మొక్కజొన్న రైతులకు గన్నీ బ్యాగులు లేకపోతే రైతులు సొంతంగా బ్యాగులు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. 22 రోజులుగా సన్ ఫ్లవర్ గింజలను కొనుగోలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే కలెక్టర్లకు ఆర్డర్ ఇచ్చి వడ్ల కొనుగోలును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పారని.. అది కాస్త బోగస్ అయ్యిందని హరీశ్‌రావు విమర్శించారు. ఎరువులు కొనాలంటే యాప్ కావాలి.. వడ్లు కొనాలంటే ఆన్‌లైన్ కావాలి అంటూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు.

# చేతిలో చిప్పతో ఢిల్లీలో చక్కర్లు

## కేంద్రమంత్రులకు కాంగ్రెస్ వేడుకోలు.. బీజేపీ ఎంపీ కొండా వివాదాస్పద వ్యాఖ్యలు



హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ నేతలపై బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. సంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి మీడియాతో మాట్లాడిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి.. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ ప్రభుత్వం నడుస్తోందని చెప్పడం తీవ్ర దుమారం రేపుతోంది. రాష్ట్రంలో నిధులు లేవని సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు నిధుల కోసం చిప్ప చేతిలో పట్టుకుని ఢిల్లీకి పోయి కేంద్రమంత్రులను కలుస్తున్నారని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సెటైర్లు వేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసి.. తిరిగి తెలంగాణకు వచ్చి మళ్లీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారని మండిపడ్డారు. మరి అలాంటప్పుడు చిప్ప చేతిలో పట్టుకొని ఢిల్లీకి ఎందుకు పోతున్నారో సమాధానం చెప్పాలంటూ అధికార కాంగ్రెస్ నేతలను ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు ఏం చేశారని కొంత మంది విమర్శిస్తున్నారని.. మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిన తర్వాత తెలంగాణలో ఇంకా ఎక్కువ వరి పంట పండుతోందని తేల్చి చెప్పారు. దేశంలోనే తెలంగాణ నుంచే కేంద్ర ప్రభుత్వం అత్యధిక ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయకపోతే మరి ఢిల్లీకి ఎందుకు వెళ్తున్నారని నిలదీశారు. కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎంత విమర్శించినా తెలంగాణ ప్రజలకు బీజేపీ మేలు చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. గత ముఖ్యమంత్రి బీజేపీపై విమర్శలు చేస్తే.. ఆయను తెలంగాణ ప్రజలు పదవి నుంచి దించేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ నుంచి రూపాయి వెళ్తే.. తిరిగి రాష్ట్రానికి కేంద్రం నుంచి కేవలం 30 పైసలు మాత్రమేనని కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపైనా కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందించారు. తెలంగాణ రాష్ట్రం మొత్తంలో హైదరాబాద్ జిల్లా ఎక్కువ పన్నులు చెల్లిస్తోందని.. మరి రాష్ట్ర ఖజానాకు వచ్చిన ఆదాయం అంతా హైదరాబాద్‌కే ఖర్చు చేస్తున్నారా అని రేవంత్ రెడ్డి సర్కార్‌ను ప్రశ్నించారు. రాష్ట్రాలకు నిధులను కేటాయించేది కేంద్ర ప్రభుత్వం అని.. నరేంద్ర మోదీ, మన్మోహన్ సింగ్, ఇందిరాగాంధీ కాదని తెలిపారు. ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాలకు నిధుల కేటాయిస్తుందని వెల్లడించారు. కేంద్రంలో మోదీ సర్కార్ వచ్చిన తర్వాత తెలంగాణకు పన్నుల్లో వాటా పెంచినట్లు కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక దేశంలోనే ఎక్కువ యూరియాను తెలంగాణ రాష్ట్రానికి కేటాయిస్తున్నామని చెప్పిన విశ్వేశ్వర్ రెడ్డి.. యుద్ధ సంక్షోభం కారణంగా పెట్రోల్ ధరలు తప్పనిసరిగా పెరుగుతాయని వెల్లడించారు. ప్రపంచంలో పెట్రో ధరలు పెంచని ఏకైక దేశం భారత్ మాత్రమేనని గుర్తు చేశారు. ఈనెల 10వ తేదీ హైదరాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఉంటుందని.. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 10 లక్షల మందితో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో మార్పులు

**అర్హుల ఎంపికలో సరికొత్త విధానం**




హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇకపై ఎటువంటి సాంకేతిక అడ్డంకులు లేకుండా సాయం అందనుంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో అత్యాధునిక మాడ్యూళ్లను అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ మరింత పకడ్బందీగా, వేగంగా సాగనుంది. గతంలో ఉన్న మాన్యువల్ విధానాలకు స్వస్తి పలికి, పూర్తిస్థాయి డిజిటలైజేషన్ వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనివల్ల భవిష్యత్తులో డేటా సేకరణలో గానీ, లబ్ధిదారుల ఎంపికలో గానీ ఎటువంటి పొరపాట్లకు తావుండదని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం సొంత స్థలం ఉండి ఇళ్లు లేని వారిని ఎల్-1 జాబితాలో చేర్చి ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23.30 లక్షల మంది ఈ జాబితాలో ఉండగా.. స్థలం కూడా లేని వారు 21.49 లక్షల మంది ఎల్-2 జాబితాలో ఉన్నారు. అనర్హులుగా తేలిన 32.98 లక్షల మందిని ఎల్-3 జాబితాలో చేర్చారు. ఈ డేటాను నిర్వహించడం, ఎప్పటికప్పుడు మార్పులు చేయడం కష్టతరంగా మారుతున్న నేపథ్యంలో.. కొత్తగా ప్రవేశపెట్టిన మాడ్యూళ్లు కీలక పాత్ర పోషించనున్నాయి. ముఖ్యంగా లబ్ధిదారుల ఎంపిక, మార్పులు, చేర్పులు, అనుమతుల ప్రక్రియ ఇకపై క్షణాల్లో జరిగిపోనుంది. గతంలో లబ్ధిదారుల అర్హతను నిర్ధారించడానికి గెజిటెడ్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి మాన్యువల్‌గా నివేదికలు ఇచ్చేవారు. దీనివల్ల డేటా ఎంట్రీలో జాప్యం, పొరపాట్లు జరిగే అవకాశం ఉండేది. ఇప్పుడు యాప్‌లోనే అర్హులైన లబ్ధిదారులు, మొత్తం విచారణ జరిపిన లబ్ధిదారులు అనే రెండు కొత్త ఆప్షన్లను చేర్చారు. అధికారులు నేరుగా యాప్‌లోనే వివరాలను నమోదు చేయగానే.. ఆ సమాచారం వెంటనే ఎంపీడీవోలు లేదా మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌కు చేరుతుంది. అక్కడ పరిశీలన పూర్తయిన తర్వాత కలెక్టర్ల ఆమోదానికి వెళ్తుంది. ఈ క్రమబద్ధీకరించిన విధానం వల్ల మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. పథకం అమలులో ఎదురవుతున్న మరో ప్రధాన సమస్య లబ్ధిదారుల ఎంపిక. తాము అర్హులమైనా ఎల్-3 (అనర్హుల) జాబితాలో చేర్చారని వేల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిని పరిష్కరించేందుకు ఎల్-3 నుంచి ఎల్-1 అనే ప్రత్యేక మాడ్యూల్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఒకవేళ పొరపాటున అర్హులు అనర్హుల జాబితాలో ఉంటే.. తగిన ఆధారాలతో వారిని తిరిగి అర్హుల జాబితాలోకి మార్చే అధికారం ఇప్పుడు సులభతరం చేయబడింది. దీనివల్ల ఏ ఒక్క పేదవాడికి అన్యాయం జరగకుండా చూడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా.. పరిపాలనాపరమైన అధికారాలను వికేంద్రీకరిస్తూ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఆధార్ మార్పులు, ఈ-కేవైసీ సమస్యలు, బిల్లుల చెల్లింపులో జాప్యం వంటి అంశాలపై గతంలో రాష్ట్ర స్థాయి ఎండీ నుంచి అనుమతులు రావాల్సి ఉండేది. దీనివల్ల లబ్ధిదారులు వారాల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ అధికారాలన్నింటినీ జిల్లా కలెక్టర్లకే అప్పగించారు. స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకునే వీలు కలగడంతో.. ఇళ్ల నిర్మాణం సజావుగా సాగడమే కాకుండా, లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు వేగంగా జమ అవుతాయి. ఈ సంస్కరణలు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన గృహ నిర్మాణ పథకంగా తీర్చిదిద్దుతాయని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# కవిత పార్టీతో ప్రయోజనం సున్నా

**కేఏ పాల్ ఆసక్తికర వ్యాఖ్యలు**



న్యూయార్క్: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవితపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కవిత ఏర్పాటు చేసిన పార్టీపై స్పందిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. ఆమెతో పార్టీని ఎవరు పెట్టించారో అందరికీ తెలుసని, అందుకే మాజీ ప్రజాప్రతినిధులు ఎవరూ ఆ పార్టీలో చేరడం లేదని అన్నారు. అవినీతి, కుటుంబ, కుల పార్టీలను ఎవరూ నమ్మవద్దని కోరారు. ఆమె స్థాపించిన పార్టీ వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని విమర్శించారు. కేవలం తండ్రితో ఉన్న గొడవ కారణంగానే ఆమె పార్టీని ఏర్పాటు చేశారు తప్ప మరో కారణం లేదని అన్నారు. తాను అమెరికా పర్యటనలో బిజీగా ఉన్నానని, అందువల్లే తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించలేకపోయానని పేర్కొన్నారు. గతంలో కవిత తన తండ్రిని ముఖ్యమంత్రి పదవి అడిగారని, అందుకు కేసీఆర్ నిరాకరించారని పేర్కొన్నారు. 2008లోనే కవిత తన వద్దకు వచ్చి పార్టీ కోసం రూ.10 కోట్లు ఇవ్వాలని అడిగారని, తాను రూ.15 కోట్లు ఇవ్వాలనుకున్నానని చెప్పారు. కానీ కవితకు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని కేసీఆర్ కోరడంతో ఆగిపోయానని చెప్పారు. తన ఆస్తులను కాపాడుకోవడం కోసమే కవిత పార్టీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. దోచుకున్న డబ్బుల విషయంలో షర్మిలకు ఎలాగైతే అన్నతో విభేధాలు వచ్చాయో, కవితకు తన కుటుంబంతో అలాగే వచ్చాయని అన్నారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతోన్న యుద్ధాన్ని ఆపేందుకు తాను డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానని అన్నారు. ఈ యుద్ధం ఆగకపోతే ప్రపంచవ్యాప్తంగా ఉన్న 850 కోట్ల మంది తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్‌తో పాటు ఎందరో దేశాధినేతలు తన సలహాలు, సూచనలు తీసుకుంటారని వ్యాఖ్యానించారు. తాను అప్పులు తీసుకువచ్చి తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేయగలనని చెప్పారు.



## మా అమ్మ కోరిక తీరింది

**డీజీపీ సీవీ ఆనంద్ భావోద్వేగం**

హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ తన తల్లిని ఉద్దేశించి భావోద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన తల్లిని కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్న ఆయన, ఈ సందర్భంగా తన మనసులోని మాటలను పంచుకున్నారు. తన తల్లి గత నవంబర్ నుంచి జనవరి వరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని, ఆ సమయంలో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. "ప్రస్తుతం అమ్మ ఆరోగ్యం మెరుగైంది, కానీ ఇంకా మంచానికే పరిమితమయ్యారు. తన కొడుకును ఈ రాష్ట్రానికి డీజీపీగా చూడాలన్న ఆమె బలమైన కోరికే, అనారోగ్యం నుంచి ఆమెను బయటపడేసిందని నేను బలంగా నమ్ముతున్నాను" అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీజీపీగా తన నియామకం గురించి తెలిసి తన తల్లి ఎంతో ఆనందపడ్డారని, ఆమె సంతోషం చూసి తానూ ఉప్పొంగిపోయానని వివరించారు. కొద్ది రోజుల క్రితమే సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

## 700 మంది తాగుబోతులు!

**హైదరాబాదులో డ్రంక్ అండ్ డ్రైవ్**

హైదరాబాద్, మే 3 (ఈవార్తలు): హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. రెండు కమిషనరేట్లలో కలిపి మొత్తం 728 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మే 1, 2 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో 445 మందిని పట్టుకున్నారు. వీరిలో 371 మంది ద్విచక్ర వాహనదారులు, 26 మంది త్రీవీలర్ వాహనదారులు, 48 మంది కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారి బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ (బీఏసీ) స్థాయిల ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) తెలిపారు. మరోవైపు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 283 మంది పట్టుబడ్డారు. వీరిలో 227 మంది టూ-వీలర్ డ్రైవర్లు, 39 మంది కార్ డ్రైవర్లు, 9 మంది త్రీ-వీలర్, 8 మంది భారీ వాహన డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

# పంట కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం: దావ వసంత

సారంగాపూర్, మే 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మొక్కజొన్న పంట చేతికొచ్చి మూడు నెలలు గడిచినా, వరి కోతకు 20 రోజులు అయినా కొనుగోలు కేంద్రాలు సక్రమంగా ప్రారంభం కాలేదని తెలిపారు. గతంలో రేచపల్లి గ్రామంలో ఉన్న మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఈ సంవత్సరం తొలగించడం రైతులకు తీవ్ర అన్యాయం అని పేర్కొన్నారు. పంట దిగుబడి పెరిగినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వెనుక ప్రభుత్వం నిర్లక్ష్యం ఉందని విమర్శించారు. ఎకరానికి సుమారు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నప్పటికీ, ప్రభుత్వం కేవలం 26 క్వింటాళ్లకే పరిమితం చేస్తోందని, మిగతా ధాన్యాన్ని రైతులు ఏమి చేసుకోవాలని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు కొనుగోళ్లు జరగలేదని, దీంతో రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. క్వింటాల్‌కు సుమారు రూ.600 వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. రైతులకు హామీ ఇచ్చిన బోనస్ కూడా పూర్తిగా అందలేదని, ఇంకా బకాయిలు ఉన్నాయని అన్నారు. ఫోన్ యాప్‌ల ద్వారా పంట వివరాలు నమోదు చేయాలనే నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా మారాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటూ, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు సాగునీరు, ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందించామని, అవసరమైన చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వెంటనే సరైన సదుపాయాలతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, కోనాపూర్ సర్పంచ్ ఆకుల రమేష్, నాయకులు బైరి మల్లేశం, భాస్కర్, తిరుపతి, రామచంద్ర రెడ్డి, జలంధర్, చిరంజీవి, ప్రేమానందం, మధు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.





## ఎస్పీఎస్ యుద్ధ భేరి!

**హక్కులు, వేతనాలపై జిల్లాల పర్యటన**

**కరీంనగర్‌లో నూతన కమిటీ ఏర్పాటు**

కరీంనగర్/జగిత్యాల, మే 3 (ఈవార్తలు): వైద్య కార్మికుల హక్కులు, వేతనాల సాధనే లక్ష్యంగా ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ యుద్ధ భేరి మోగించింది. అందులో భాగంగా కార్మికుల ఐక్యత కోసం జిల్లాల పర్యటన చేస్తోంది. తాజాగా, ఆదివారం ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కుర్రి సైదయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా పంజాల అంజలి, అధ్యక్షురాలిగా సుగుణ, ఉపాధ్యక్షులుగా హలీం, శంకర్, ప్రధాన కార్యదర్శిగా రాజన్న, సహాయ కార్యదర్శులుగా కళ, శేఖర్, కోశాధికారిగా రమేశ్, సభ్యులుగా విజయ, లావణ్య, సరళ, శారద తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైనాల రవి, మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఉబ్బ రమణ, గొర్రె నాగరాజు సహా మట్టి శ్రీనివాస్, పీ అంజలి, కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరంతా హక్కుల సాధన కోసం పాటుపడాలని తీర్మానించారు.

## జగిత్యాలలో నూర్ భాష దూదేకుల సంఘం ప్రమాణం



జగిత్యాల, మే 3 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో నూర్ భాష దూదేకుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈరోజు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన పదాధికారులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ అధ్యక్షుడిగా అబ్దుల్ రహీం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండి అజీమ్, ఉపాధ్యక్షుడిగా ఎంఏ సమీవుద్దిన్, ప్రధాన కార్యదర్శిగా ఎండి రియాజ్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే జాయింట్ సెక్రటరీగా ఎండి అప్సర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎండి షఫీ, కోశాధికారిగా ఎండి చాంద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇతరంగా కార్యవర్గ సభ్యులుగా మొత్తం 8 మంది సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసి సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, ప్రముఖులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇల్లు దగ్ధం.. బాధితురాలికి బీఆర్ఎస్ నేతల పరామర్శ

సారంగాపూర్, మే 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన భూమన్న నివాస గృహం కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు స్థానిక నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా అందే నష్టపరిహారం త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, కోనాపూర్ సర్పంచ్ ఆకుల, బీఆర్ఎస్ నాయకులు రామ్ చంద్ర రెడ్డి, బైరి మల్లేశం, భాస్కర్, చిరంజీవి, జలంధర్, ప్రేమానందం, గంగాధర్, మధు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, మే 3 (ఈవార్తలు): జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన షరీఫ్--హప్సా దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకంలో మంజూరైన గృహ నిర్మాణం పూర్తయింది. ఈ సందర్భంగా గృహప్రవేశ కార్యక్రమానికి ఆహ్వానం మేరకు జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. అనంతరం గృహ యజమానులకు చీరను కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా పేదలకు స్వగృహ స్వప్నం సాకారం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, ఉప సర్పంచ్ బాలే శ్రీను, మాజీ సర్పంచ్ ప్రభాకర్, మాజీ ఉప సర్పంచ్ మహేష్, ఏఎంసీ డైరెక్టర్ నరేష్, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు అమరావతి బంగారు బాతు

నెల్లూరు, మే 3 (ఈవార్తలు): వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ తీవ్రంగా స్పందించింది. చంద్రబాబే ఒక గడ్డపారలా మారి ప్రభుత్వ ఖజానాను, ప్రజా సంక్షేమాన్ని తవ్వి తీస్తున్నారని వైసీపీ ఎదురుదాడికి దిగింది. ఆదివారం నెల్లూరులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, టీడీపీ నేతలు వైసీపీని హత్యారాజకీయాలు చేసే గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తున్నారని, కానీ వాస్తవానికి చంద్రబాబే ఒక గడ్డపారకు చిహ్నమని కాకాణి విమర్శించారు. అమరావతి ప్రాజెక్టు చంద్రబాబుకు, ఆయన బృందానికి ఒక బంగారు బాతుగా మారిందని ఆరోపించారు. ఒకవైపు పెంచిన కాంట్రాక్టుల ద్వారా ప్రజాధనాన్ని దోచుకుంటూ, మరోవైపు విద్య, వైద్యం, రైతులు, మహిళలు, యువతను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతిలో చదరపు అడుగు నిర్మాణానికి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 20,489 చెల్లిస్తున్నారని, సాధారణంగా దీనికి రూ. 4,500 మాత్రమే ఖర్చవుతుందని కాకాణి అన్నారు. తెలంగాణ సచివాలయం, పార్లమెంట్ భవనం నిర్మాణ ఖర్చులు కూడా ఇంతకంటే చాలా తక్కువని గుర్తుచేశారు. గతంలో తనకు అనుకూలంగా ఉన్నవారికే మళ్లీ కాంట్రాక్టులు కట్టబెట్టి, రేట్లు పెంచి వ్యవస్థీకృతంగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని, పదవిని లాక్కోవడంతో మొదలైన చంద్రబాబు తీరు మారలేదని, అవినీతి, కుట్రలు ఆయన నైజమని విమర్శించారు. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు ఉన్నారని కాకాణి ధీమా వ్యక్తం చేశారు.

### కన్నాపూర్‌లో గ్రామపంచాయతీ

# భవనానికి ఎమ్మెల్యే భూమిపూజ



జగిత్యాల రూరల్, మే 3 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ భూమిపూజ నిర్వహించారు. రూ.20 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సఫాయి కార్మికుడు లక్ష్మణ్‌కు మే డే వేడుకల సందర్భంగా ఉత్తమ కార్మికునిగా లభించిన ప్రశంసా పత్రాన్ని ఎమ్మెల్యే సత్కరించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కొలుగురి దామోదర్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, సర్పంచ్ పొట్టవతిని సతీష్, ఉప సర్పంచ్ ప్రశాంత్, సీనియర్ నాయకులు బాలముకుందం, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు కట్ట రాజేందర్, డీఈ మిలింద్, ఎమ్మార్వో హకీమ్, ఎంపీవో రవి బాబు, ఏఈ రాజమల్లయ్య, ఆర్ఐ భూమయ్య, మాజీ సర్పంచ్ బొడ్డుదామోదర్, శేఖర్ రావు, నాగిరెడ్డి, గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ భూమారెడ్డి, ఉప సర్పంచ్ ముద్దం మల్లేశం, నాయకులు మీస వేణు, శివ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: ముఖేష్ ఖన్నా



జగిత్యాల, మే 3 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను పీసీసీ సేవాదళ్ కార్యదర్శి ముఖేష్ ఖన్నా తీవ్రంగా ఖండించారు. ఆదివారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీవన్ రెడ్డి తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నలభై మూడు ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న జీవన్ రెడ్డి కేవలం పదవి ఆశతోనే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. "కాంగ్రెస్ పోవాలి -- బిఆర్ఎస్ రావాలి" అన్న వ్యాఖ్యలు బాధాకరమని, ఒక సీనియర్ నాయకుడిగా అది తగదన్నారు. జగిత్యాల అభివృద్ధిపై జీవన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ, తన మంత్రిత్వ కాలంలో యావర్ రోడ్ విస్తరణ ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. అలాగే జగిత్యాలకు మంజూరైన జెఎన్టీయూ కళాశాలను నాచుపెల్లికి తరలించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని, నర్సింగపూర్‌లో భూములు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. జీవన్ రెడ్డి అనుచరులు సోషల్ మీడియాలో బెదిరింపులకు పాల్పడుతున్నారని, అలాంటి చర్యలకు భయపడబోమని స్పష్టం చేశారు. గతంలో కాళేశ్వర ప్రాజెక్టును విమర్శించిన ఆయన, ప్రస్తుతం అదే ప్రాజెక్టును ప్రశంసించడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందన్నారు. రైతు బంధు పథకంపై గతంలో విమర్శలు చేసిన జీవన్ రెడ్డి, ఇప్పుడు ప్రభుత్వం రైతులకు సాయం చేస్తుంటే తిరిగి విమర్శించడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నించే హక్కు ఆయనకు లేదన్నారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. వ్యక్తుల కంటే పార్టీ వ్యవస్థ ముఖ్యమని పేర్కొన్నారు. చివరగా, ప్రభుత్వం మరియు పార్టీపై విమర్శలు కొనసాగిస్తే తగిన ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్ సింగ్, కార్యదర్శి భోగ నాగభూషణం, మైనారిటీ రాష్ట్ర నాయకులు ఖుర్షిద్, పట్టణ అధ్యక్షుడు ద్యావనపల్లి రాజేందర్, నాయకులు ఉషకోల గంగాధర్, గట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## మోదీ సభను విజయవంతం చేయాలి

**పార్టీ శ్రేణులకు ఏలేటి దిశానిర్దేశం**

**హైదరాబాద్ సభకు భారీగా తరలిరావాలని పిలుపు**

జగిత్యాల, మే 3 (ఈవార్తలు): ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం జగిత్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ అభివృద్ధి దిశగా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని సూచించారు. రాబోయే సభలో జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. సభ విజయవంతం ద్వారా పార్టీ బలం మరింత పెరుగుతుందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న ఈ బహిరంగ సభకు జగిత్యాల జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలను తరలించేలా ప్రణాళికలు రూపొందించాలని, ప్రతి మండలం, ప్రతి బూత్ స్థాయిలో సమన్వయం చేసుకోవాలని నాయకులకు సూచించారు. కార్యక్రమం విజయవంతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేందర్ రెడ్డి, జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ భోగ శ్రావణి తదితరులతో పాటు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గూడూరు 46.2 డిగ్రీలు

**రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు**

**ముమ్మిడివరంలో 72.7 మిమీ వర్షపాతం**

గూడూరు, మే 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం విచిత్రంగా మారింది. ఒకవైపు భానుడు తన విశ్వరూపం చూపిస్తుంటే, మరోవైపు అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం నాడు నెల్లూరు జిల్లా గూడూరులో అత్యధికంగా 46.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. ఈ సీజన్ లో ఇప్పటివరకు ఇదే రికార్డు. ఇదే సమయంలో ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో కూడా 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇందుకు పూర్తి భిన్నంగా, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ముమ్మిడివరంలో అత్యధికంగా 72.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కాత్రేనికోనలో 57.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ఒకే రాష్ట్రంలో ఎండ తీవ్రత, భారీ వర్షాలు అనే రెండు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం (మే 4) కూడా ఇదే తరహా వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విజయనగరం, మన్యం, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోని 27 మండలాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరోవైపు కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, ఉత్తరాంధ్రతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షం సమయంలో రైతులు, పశువుల కాపరులు చెట్ల కిందకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.



## సర్వర్లు మార్చేస్తున్న బెట్టింగ్ యాప్‌లు!

**పోలీసులకే సవాల్ విసురుతున్న ముఠాలు**

విజయవాడ, మే 3 (ఈవార్తలు): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాలు పోలీసులకే సవాల్ విసురుతున్నాయి. తమపై నిఘా పడిందని అనుమానం రాగానే.. డొమైన్ పేరు, సర్వర్‌ను మార్చేస్తూ సాంకేతికంగా తప్పించుకుంటున్నాయి. విజయవాడ పోలీసులు దర్యాప్తు చేస్తున్న వీఎల్ బుక్ యాప్ కేసులో ఈ హైటెక్ ఎత్తుగడలు వెలుగులోకి వచ్చాయి. ఒక వెబ్‌సైట్‌ను పోలీసులు బ్లాక్ చేసినా, తమ కార్యకలాపాలకు, ఆర్థిక లావాదేవీలకు ఎలాంటి నష్టం జరగకుండా నిర్వాహకులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. పాత యాప్ మూతపడగానే, కొత్త పేరుతో మరో యాప్ పుట్టుకొస్తోంది. విచారణలో భాగంగా పోలీసులు బెట్టింగ్ ముఠాల నగదు బదిలీ విధానాన్ని గుర్తించారు. పందెం కాసేవారు ఏజెంట్లు చెప్పిన ఖాతాలో డబ్బు జమ చేయగానే, ఆ మొత్తం వెంటనే మరో ఖాతాకు బదిలీ అవుతోంది. ఇలా సాలెగూడులా ఒకదాని నుంచి మరొకదానికి నిధులు మళ్లుతున్నాయి. ఇప్పటివరకు పోలీసులు సుమారు 30 బ్యాంకు ఖాతాలను గుర్తించి, వాటిలో 10 ఖాతాల కార్యకలాపాలను స్తంభింపజేశారు. ఒక్కో ఖాతాలో కనీసం రూ.10 లక్షలకు పైగా లావాదేవీలు జరిగినట్లు తేలింది. బెట్టింగ్ రాయుళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు 24 గంటలూ పనిచేసే కస్టమర్ కేర్ సెంటర్లను కూడా నడుపుతున్నారు. డబ్బు సులువుగా జమ చేసేందుకు క్యూఆర్ కోడ్‌ను అందిస్తున్నారు. డబ్బు బదిలీ చేసి, ఆ ఫొటోను వాట్సప్‌లో పంపితే చాలు.. 30 సెకన్లలోనే ఆ మొత్తాన్ని బెట్టింగ్ వ్యాలెట్‌కు బదిలీ చేసి మెసేజ్ పంపుతున్నారు. గెలిచిన డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు మాత్రం కస్టమర్లు తమ బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

## కనకదుర్గమ్మకు రికార్డు ఆదాయం

**17 రోజుల్లో రూ. 2.83 కోట్ల ఆదాయం**

విజయవాడ, మే 3 (ఈవార్తలు): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గత 17 రోజులకు (ఏప్రిల్ 15 నుంచి మే 2 వరకు) సంబంధించిన హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించగా, రూ. 2,83,17,242 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ మొత్తం ఆదాయంలో నోట్ల రూపంలో రూ. 2,70,22,242, నాణేల రూపంలో రూ. 12,95,000 ఉన్నట్లు తెలిపారు. సగటున రోజుకు సుమారు రూ. 16.65 లక్షల ఆదాయం లభించినట్లు అంచనా. నగదుతో పాటు 329 గ్రాముల బంగారం, 3.8 కిలోల వెండిని కూడా భక్తులు కానుకలుగా సమర్పించారు. అలాగే, విదేశీ భక్తులు సమర్పించిన 707 అమెరికా డాలర్లు, సౌదీ రియాల్స్, యూఏఈ దిర్హామ్‌లతో పాటు పలు దేశాల కరెన్సీ నోట్లు కూడా హుండీలో లభ్యమయ్యాయి. ఆలయ ప్రాంగణంలోని మహా మండపంలో, సీసీ కెమెరాల నిఘా మధ్య కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఈ లెక్కింపు ప్రక్రియను పూర్తి చేశారు. వేసవి సెలవుల కారణంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరగడంతోనే ఆదాయం పెరిగిందని అధికారులు భావిస్తున్నారు.



## విమానం కదులుతుండగా దూకిన ప్రయాణికుడు

**చెన్నై విమానాశ్రయంలో ఘటన.. అరెస్ట్**

చెన్నై: షార్జా-చెన్నై విమానం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కాగానే ఒక ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్ తెరిచి కిందకు దూకడం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈరోజు ఉదయం జరిగిన ఈ ఘటనతో, తోటి ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. వేకువజామున షార్జా నుంచి ఎయిర్ అరేబియా విమానం ల్యాండ్ కాగానే, ట్యాక్సీవేపై కదులుతుండగా సదరు ప్రయాణికుడు బయటకు దూకాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే పైలట్ గ్రౌండ్ సెక్యూరిటీని అప్రమత్తం చేశారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ కోసం అతడిని పోలీసులకు అప్పగించారు. "ఆ ప్రయాణికుడు కిందకు దూకినప్పుడు విమానం ఇంకా నెమ్మదిగా కదులుతూనే ఉంది. అతడికి ఏమీ కాలేదు. విమానానికి కూడా నష్టం జరగలేదు" అని విమానాశ్రయ సీనియర్ అధికారి ఒకరు అన్నారు. విమాన ప్రయాణం సమయంలో అతడు అస్వస్థతకు గురై ఉండవచ్చని అధికారులు తెలిపారు. తనకు వామ్‌టింగ్ వస్తున్నదని అతను విమానంలో సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాడు. విమానంలో కూడా రెండుసార్లు వామ్‌టింగ్ చేసుకున్నాడని చెప్పారు. అస్వస్థత కారణంగానే అతడు విమానం కదులుతుండగానే దూకి ఉండవచ్చని చెబుతున్నారు. ఆ ప్రయాణికుడిని తమిళనాడులోని పుదుక్కోట్టై జిల్లాకు చెందినవాడిగా గుర్తించారు. ఈ ఘటన వల్ల కొద్దిసేపు విమాన కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. ముందుజాగ్రత్త చర్యగా తెల్లవారుజామున గంటసేపు ప్రధాన రన్‌వేను మూసివేసి, విమానాలను మరో రన్ వేకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

## ఇరాన్ 14 ప్రతిపాదనలు

**అమెరికాకు పంపిన టెహ్రాన్ బృందం**

టెహ్రాన్: యుద్ధానికి ముగింపు పలకడానికి ఇరాన్ 14 పాయింట్లతో కొత్త ప్రతిపాదనలను అమెరికాకు పంపించింది. పాకిస్థాన్ ద్వారా ఈ ప్రతిపాదనలను అమెరికాకు పంపించినట్లు ఇరాన్ జాతీయ మీడియా తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు అమెరికా 9 పాయింట్లను ప్రతిపాదించింది. ప్రతిగా, ఇరాన్ 14 పాయింట్లతో తాజా ప్రతిపాదనలు పంపించింది. యుద్ధాన్ని అన్ని విధాలుగా ముగించాలని తాజా ప్రతిపాదనల్లో స్పష్టం చేసింది. లెబనాన్‌లో కూడా యుద్ధం ముగింపును ఇరాన్ కోరుకుంది. తమపై మళ్లీ దాడులు చేయవద్దని, సరిహద్దు ప్రాంతాల్లో అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవాలని, వివిధ దేశాల్లో స్తంభింప చేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, ఇంధనం సహా వివిధ రూపాల్లో తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఆ ప్రతిపాదనల్లో స్పష్టం చేసింది. హార్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొంది. యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ ఈ ప్రతిపాదనల్లో తెలిపింది. కాల్పుల విరమణ పొడిగింపు పేరుతో తాత్కాలిక సంధికి బదులు సమస్యను శాశ్వతంగా ముగించేలా సమగ్ర పరిష్కారాన్ని ఇరాన్ కోరింది. ముప్పై రోజుల్లో యుద్ధాన్ని ముగించాలని కోరింది. యుద్ధానికి ముగింపు పలకాలా లేక కొనసాగించాలా అనే నిర్ణయం ఇప్పుడు అమెరికానే తీసుకోవాలని ఇరాన్ తెలిపింది. యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ లక్ష్యమని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలు, భద్రతను కాపాడుకోవడానికి తాము మాత్రం దేనికైనా సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

## 50 హెజ్బొల్లా స్థావరాలు ధ్వంసం

**ఇజ్రాయెల్ భీకర దాడులు**

జెరూసలేం: ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) భీకర దాడులు నిర్వహించింది. ఆదివారం తెల్లవారుజామున జరిపిన ఈ దాడుల్లో 50కి పైగా కీలక మౌలిక సదుపాయాల కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. దక్షిణ లెబనాన్, బెకా వ్యాలీలోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఈ వైమానిక దాడులు జరిగినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. గత 24 గంటల్లోనే సుమారు 50 లక్ష్యాలపై దాడి చేశామని ఐడీఎఫ్ శనివారం ప్రకటించింది. ఈ వారాంతంలో మొత్తం 70 సైనిక నిర్మాణాలు, 50 మౌలిక సదుపాయాల సైట్‌లతో కలిపి 120 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు మరో నివేదిక పేర్కొంది. హెజ్బొల్లాకు చెందిన కమాండ్ సెంటర్లు, ఆయుధాగారాలు, సైనిక భవనాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. తమ దేశ పౌరులు, సైనికులపై దాడులను అడ్డుకోవడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు స్పష్టం చేసింది. ఆదివారం ఉదయం కూడా దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు, డ్రోన్లతో దాడులు చేసింది. మరోవైపు, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 12 మంది వరకు మరణించినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అయితే, మృతుల్లో ఎంతమంది పౌరులు, ఎంతమంది మిలిటెంట్లు ఉన్నారనే దానిపై స్పష్టత లేదు. దాడులకు ముందు పలు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఇరుపక్షాల దాడులు, ప్రతిదాడులతో సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## నెదర్లాండ్స్ యువరాణుల హత్యకు కుట్ర!


లండన్: నెదర్లాండ్స్‌లో ఇద్దరు రాజకుమార్తెలపై హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేయడం సంచలనం సృష్టిస్తోంది. డచ్ సింహాసనానికి వారసురాలైన యువరాణి కాథరినా-అమాలియా (22), ఆమె సోదరి యువరాణి అలెక్సియా (20)లే లక్ష్యంగా దాడికి ప్లాన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో హేగ్ నగరంలో 33 ఏళ్ల వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రెండు గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక గొడ్డలిపై 'అలెక్సియా', ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ 'మొస్సాద్', నాజీ నినాదమైన 'సీగ్ హీల్' వంటి పదాలు చెక్కి ఉండటం తీవ్ర కలకలం రేపింది. దీంతో పాటు 'అమాలియా', 'అలెక్సియా', 'బ్లడ్‌బాత్' (రక్తపాతం) అని రాసి ఉన్న చేతిరాత నోట్‌ను కూడా అధికారులు కనుగొన్నారు. ఈ అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను పబ్లిక్ ప్రాసిక్యూషన్ కార్యాలయం తాజాగా వెల్లడించింది. నిందితుడి తరఫు న్యాయవాది కోర్టు విచారణకు ముందు వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. కాగా, డచ్ రాజకుటుంబం కూడా ఈ ఘటనపై తక్షణమే స్పందించలేదు. యువరాణి అమాలియాకు భద్రతాపరమైన ముప్పు ఎదురవడం ఇది మొదటిసారి కాదు. 2022లో ఆర్గనైజ్డ్ క్రైమ్ ముఠాల నుంచి తీవ్రమైన బెదిరింపులు రావడంతో ఆమె ఆమ్‌స్టర్‌డామ్‌లోని విద్యార్థి వసతి గృహాన్ని విడిచిపెట్టి, దాదాపు ఏడాది పాటు స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో నివసించాల్సి వచ్చింది. తాజా ఘటనతో రాజకుటుంబ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



# ఇజ్రాయెల్‌కు హిజ్బుల్లా డ్రోన్ల భయం

**ఎలక్ట్రానిక్ జామింగ్‌కు చిక్కని డ్రోన్లు**

జెరూసలేం: ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఘర్షణలో హిజ్బుల్లా సరికొత్త, ప్రమాదకరమైన ఆయుధాన్ని ప్రయోగిస్తోంది. ఎలక్ట్రానిక్ జామింగ్‌కు ఏమాత్రం చిక్కని ఫైబర్ ఆప్టిక్ గైడెడ్ క్వాడ్‌కాప్టర్ డ్రోన్లతో దాడులకు పాల్పడుతూ ఇజ్రాయెల్ సైన్యాన్ని (ఐడీఎఫ్) ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల జరిపిన ఇటువంటి దాడిలోనే 19 ఏళ్ల ఐడీఎఫ్ సార్జెంట్ ఇడాన్ ఫూక్స్ మరణించగా, మరికొందరు సైనికులు గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించిన వీడియోను హిజ్బుల్లానే స్వయంగా విడుదల చేసింది. సాధారణంగా డ్రోన్లను రేడియో సిగ్నల్స్ ద్వారా నియంత్రిస్తారు. ఇజ్రాయెల్ తన సాంకేతికతతో ఆ సిగ్నల్స్‌ను జామ్ చేసి డ్రోన్లను నిర్వీర్యం చేస్తుంది. అయితే, హిజ్బుల్లా వాడుతున్న ఈ కొత్త డ్రోన్లు ఆపరేటర్‌కు ఒక సన్నని ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌తో అనుసంధానమై ఉంటాయి. దాదాపు 15 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ కేబుల్ కంటికి కనిపించకపోవడంతో, డ్రోన్‌ను గుర్తించడం, దానిపై దాడి చేయడం ఇజ్రాయెల్ సైన్యానికి కష్టంగా మారింది. చైనా లేదా ఇరాన్ నుంచి తెప్పించిన ఈ డ్రోన్లకు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వాడిన ఫైబర్ ఆప్టిక్ పరిజ్ఞానాన్ని హిజ్బుల్లా జతచేసింది. ఈ డ్రోన్లు చాలా చిన్నవిగా ఉండి, గ్రెనేడ్ల వంటి పేలుడు పదార్థాలను మోసుకెళతాయి. వీటిని "చౌకైన, అదృశ్య, కచ్చితమైన కిల్లర్లు"గా అభివర్ణిస్తున్నారు. ఈ ముప్పును ఎదుర్కోవడానికి ఇజ్రాయెల్ సైన్యం సరిహద్దుల్లో వలలు, ఇతర భౌతిక అడ్డంకులు ఏర్పాటు చేస్తోంది. ఎలక్ట్రానిక్ యుద్ధంలో ఆరితేరినప్పటికీ, ఈ తక్కువ ఖర్చు ఆయుధం తమకు పెను సవాల్‌గా మారిందని, దీనిని ఎదుర్కొనేందుకు ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నామని ఇజ్రాయెల్ అధికారులు అంగీకరిస్తున్నారు.




## మిషన్ దృష్టి విజయవంతం

**భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం**

**బెంగళూరు స్టార్టప్ గెలాక్సీఐ స్పేస్ ప్రయోగం**

బెంగళూరు: భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న స్టార్టప్ 'గెలాక్సీఐ స్పేస్' అభివృద్ధి చేసిన 'మిషన్ దృష్టి' శాటిలైట్‌ను ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. దేశీయ ప్రైవేట్ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థలో ఇది ఒక కీలక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సుమారు 190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి', ఇప్పటివరకు ఒక భారతీయ ప్రైవేట్ సంస్థ నిర్మించిన అతిపెద్ద ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' టెక్నాలజీ కలిగిన శాటిలైట్ కావడం విశేషం. ఈ విజయంతో గెలాక్సీఐ స్పేస్, అంతరిక్ష సాంకేతికతలో సరికొత్త హద్దులను చెరిపేస్తున్న స్టార్టప్‌ల సరసన నిలిచింది. ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. గెలాక్సీఐ వ్యవస్థాపకులు, యావత్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్'లో స్పందిస్తూ, "మన అంతరిక్ష ప్రయాణంలో గెలాక్సీఐ వారి మిషన్ దృష్టి ఒక ప్రధాన విజయాన్ని సూచిస్తుంది. ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ శాటిలైట్, భారతదేశంలో ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించడం మన యువత ఆవిష్కరణల పట్ల, దేశ నిర్మాణం పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. గెలాక్సీఐ వ్యవస్థాపకులకు, మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## ఆధార్ కార్డు డిజైన్ మారుతుందా?

**తప్పుడు ప్రచారం: పీఐబీ ఫ్యాక్ట్ చెక్**

న్యూఢిల్లీ: ఆధార్ కార్డు డిజైన్/ఫార్మాట్ త్వరలో మారబోతోందని, కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్‌తో మాత్రమే కొత్త కార్డు అందుబాటులోకి వస్తుందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సోషల్ మీడియా, కొన్ని వార్తా కథనాల్లో వస్తున్న ఈ ఊహాగానాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆధార్ కార్డు రూపురేఖలు మారనున్నాయంటూ వస్తున్న వార్తలు ప్రజల్లో అనవసర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "ఆధార్ కార్డులో మార్పులు తీసుకువచ్చే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదు. ప్రస్తుత ఫార్మాట్‌లోనే ఆధార్ కార్డు కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించింది. ఆధార్‌కు సంబంధించిన ఏదైనా అధికారిక సమాచారం కోసం భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) వెబ్‌సైట్, అధికారిక సోషల్ మీడియా ఖాతాలు లేదా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ద్వారా వెలువడే ప్రకటనలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ధ్రువీకరణ లేని సమాచారాన్ని ప్రసారం చేయవద్దని మీడియా సంస్థలకు కూడా హితవు పలికింది. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థగా ఉన్న ఆధార్‌కు దేశంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సుమారు 134 కోట్ల మంది ఆధార్ వాడుతుండగా, ఇప్పటివరకు 17,000 కోట్లకు పైగా లావాదేవీల కోసం దీనిని వినియోగించారు.

## సీఎం హోదాను తొలగించిన పినరయి

**సోషల్ మీడియా ఖాతాలో మార్పులు**

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్న తరుణంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన సోషల్ మీడియా ఖాతాల్లో చేసిన మార్పులు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయన తన అధికారిక ఖాతాల నుంచి 'ముఖ్యమంత్రి' అనే హోదాను తొలగించారు. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి దాదాపు 12 గంటల ముందు ఈ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో 'చీఫ్ మినిస్టర్' అనే హోదా స్థానంలో 'కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్‌బ్యూరో' ఈ అనూహ్య పరిణామం కేరళ రాజకీయాల్లో ఉత్కంఠను మరింత పెంచింది. ఈ మార్పులపై సోషల్ మీడియాలో నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. "పినరయి విజయన్ ఫలితాలను ముందే పసిగట్టారా?", "ఓటమిని అంగీకరించి హోదా మార్చారా?" అంటూ పలువురు కామెంట్లు చేస్తున్నారు. అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ కూటమి ఓటమి ఖాయమని తెలియడంతోనే విజయన్ ఈ నిర్ణయం తీసుకున్నారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి.

విజయ్ రిసార్ట్ రాజకీయం

తమిళనాడులో ఫలితాలకు ముందే టెన్షన్

హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందన్న అంచనాలు

ఎమ్మెల్యేలు చేజారకుండా టీవీకే చీఫ్ అలర్ట్

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ఒక రోజు ముందుగానే రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో నటుడు సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం పార్టీ అప్రమత్తమైంది. ఫలితాల అనంతరం తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా ఉండేందుకు 'రిసార్ట్ రాజకీయాలకు' సిద్ధమవుతోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం గెలిచిన ఎమ్మెల్యేలను మహాబలిపురం సమీపంలోని పూంజేరిలో ఉన్న ఓ ప్రైవేట్ రిసార్టుకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 100 మందికి పైగా బస చేసేందుకు వీలుగా ఈ రిసార్టును సిద్ధం చేయాలని విజయ్ పార్టీ ముఖ్య నేతలకు సూచించినట్లు తెలిసింది. మే 4న ఫలితాలు వెలువడిన వెంటనే గెలిచిన అభ్యర్థులను ఇక్కడికి తరలించనున్నారు. గతవారం ఎగ్జిట్ పోల్స్ వెలువడిన తర్వాత విజయ్ తన పార్టీ అభ్యర్థులతో సమావేశమయ్యారు. గెలిచిన తర్వాత ఎవరూ ఎక్కడికీ వెళ్లవద్దని, వెంటనే పనైయూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి రావాలని ఆయన స్పష్టం చేశారు. దీంతో పాటు, కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ లీగల్ వింగ్‌ను కూడా అప్రమత్తం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరాల్సిందిగా పార్టీ జనరల్ సెక్రటరీ ఆధవ్ అర్జునను విజయ్ ఆదేశించారు. మరోవైపు, అధికార డీఎంకే మాత్రం తాము అతిపెద్ద పార్టీగా అవతరించి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తోంది.

ఒక్క నౌక కూడా హార్మూజ్ దాటదు: ఇరాన్

టెహ్రాన్: హార్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, తమ అనుమతి లేకుండా స్నేహపూర్వక లేదా శత్రు దేశాలకు చెందిన ఏ నౌక కూడా ఆ మార్గం గుండా ప్రయాణించలేదని ఇరాన్ ఆర్మీ స్పష్టం చేసింది. ఈ జలసంధిని నియంత్రించడం తమకు ఉన్న సహజమైన హక్కు అని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా అన్నారు. ప్రస్తుతం ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, దేశ సైన్యం సంయుక్తంగా హార్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నాయని ఆయన తెలిపారు. తమ బలగాల అనుమతి లేకుండా ఏ నౌకకూ ప్రయాణించే హక్కు లేదని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు, తమ నౌకలను అనుమతించాలంటూ వివిధ దేశాలు టెలెక్స్, లేఖల ద్వారా ఇరాన్‌ను అత్యవసరంగా అభ్యర్థిస్తున్నాయని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి హమీద్ ఘన్‌బారీ వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ హార్మూజ్ జలసంధిపై తన పట్టును బిగించింది. తమ భూభాగంపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన నేపథ్యంలో ఆ రెండు దేశాలకు చెందిన, వాటితో సంబంధం ఉన్న నౌకలపై ఇరాన్ నిషేధం విధించింది. ఇదిలా ఉండగా, పెర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధిలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా





వయ్యారి చిత్రం



నిక్కీ తంబోలి





## బాలయ్యకు కాజల్ బెటర్ అన్నా!

నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న 111వ సినిమా విషయంలో ఒక ఆసక్తికరమైన మార్పు జరిగింది. ఇన్నాళ్లూ ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా నయనతార పేరు వినిపించినా, ఇప్పుడు ఆమె స్థానంలో కాజల్ అగర్వాల్ వచ్చి చేరింది. సాధారణంగా స్టార్ హీరోయిన్ మారడం అంటే సినిమాకు లోటు అని అందరూ అనుకుంటారు కానీ, బాలయ్య విషయంలో మాత్రం ఇది ఒక రకంగా ప్లస్ అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు మంచి గుర్తింపు తెచ్చుకున్నా, ప్రస్తుత పరిస్థితుల్లో నయన్ కంటే కాజల్ ఎంపికే సరైనదని ఫిలిం నగర్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నిజానికి బాలయ్య, నయనతార అనగానే మనకు సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా వంటి సినిమాలు గుర్తొస్తాయి. ఆ చిత్రాల్లో వీరి జోడీ బాగా సెట్ అయిందనే పేరుంది. అయితే ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ నుంచి నయన్ దూరమవ్వడానికి ప్రధాన కారణం ఆమె ఇతర సినిమాలతో బిజీగా ఉండటమే. గతేడాది ప్రారంభం కావాల్సిన ఈ సినిమా షూటింగ్ ఇప్పుడు 2026కి వాయిదా పడటంతో, నయన్ తన డేట్స్‌ను అడ్జస్ట్ చేయలేక తప్పుకోవాల్సి వచ్చింది.

## వారణాసికి నీటి కష్టాలు!

మహేశ్ బాబు-రాజమౌళి కాంబోలో తెరకెక్కుతున్న సినిమా 'వారణాసి'. ఇప్పటికే చాలాభాగం షూటింగ్ పూర్తయింది. త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రారంభించాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇంతలోనే మూవీ టీమ్‌కి ఊహించని షాక్ తగిలినట్లు తెలుస్తోంది. చాలామందికి ఉన్నట్లే



'వారణాసి' బృందానికి కూడా నీటి కష్టాలు ఎదురయ్యాయి. మే 18 నుంచి హైదరాబాద్‌లోని గగన్‌పహాడ్ ఏరియాలో వేసిన సెట్‌లో నీటి అడుగున సన్నివేశాలు తీసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. శుద్ధి చేసిన నీరు భారీ మొత్తంలో అవసరముంది. దీంతో 10,000 లీటర్ల కెపాసిటీ ఉన్న 150 ట్యాంకర్ల నీరు కావాలని మూవీ టీమ్.. హైదరాబాద్ వాటర్ బోర్డుకి ధరఖాస్తు చేసినట్లు సంబంధిత లెటర్ ఒకటి వైరల్ అవుతోంది. అయితే 'వారణాసి' టీమ్ రిక్వెస్ట్‌ని హైదరాబాద్ వాటర్ బోర్డ్ తిరస్కరించిందట. నగరంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, వివిధ ప్రాంతాల నుంచి నీటి డిమాండ్ పెరగడంతోనే.. నిర్మాతలకు వాటర్ ట్యాంకర్లు పంపించలేమని బోర్డ్ బదులిచ్చిందట. దీంతో నీటి కష్టాలు ఏర్పడ్డాయి. అయితే దీనికి వేరే ఏమైనా ప్లాన్స్ ఉన్నాయా? లేదంటే వేసవి పూర్తయిన తర్వాత షూటింగ్ చేస్తారా అనేది చూడాలి అనే విషయాలు తెలియాల్సి ఉంది.


## మే 22న అనుష్క రుద్రమదేవి రీరిలీజ్

అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన రుద్రమదేవి చిత్రం 2015లో విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రానా దగ్గుబాటి, అల్లు అర్జున్ కీలక పాత్రల్లో నటించారు. దర్శకుడు గుణశేఖర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడం మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరించాడు. ఇటీవల కాలంలో తెలుగు సినిమా పరిశ్రమలో పలు హిట్ చిత్రాలు రీ రిలీజ్ అవుతున్న నేపథ్యంలో రుద్రమదేవి చిత్రాన్ని కూడా మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మూవీ బృందం నిర్ణయించింది. ఈ మేరకు ఈ సినిమాను మే 22వ తేదీన భారీ స్థాయిలో థియేటర్లలో రీ రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఇప్పుడు ఈ రీ రిలీజ్ సందర్భంగా రుద్రమదేవి చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభావం చూపిస్తుందో చూడాల్సి ఉంది. ఇప్పటికే ఈ చిత్రానికి మంచి క్రేజ్ ఉండటంతో రీ రిలీజ్ లో కూడా ప్రేక్షకుల నుండి మంచి స్పందన వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇళయరాజా సంగీతం అందించిన ఈ చిత్రంలో శివ కుమార్ శ్రీపాద, విక్రమ్‌జిత్ విర్క్, ప్రకాశ్ రాజ్, కృష్ణంరాజు, నిత్యా మీనన్, ఆదిత్య మీనన్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.



తనకు మద్యం బాటిల్ చూడగానే నాలుక రుచి మరిగేదని జాన్వీ కపూర్ నిజాయితీగా అంగీకరించారు. ఈ స్థితి నుంచి బయటపడలేకపోయానని తెలిపారు. బాలీవుడ్ నటి జన్వీ కపూర్ తన వ్యక్తిగత జీవితంలోని చీకటి కోణాలను బహిరంగంగా వెల్లడించారు. మద్యం తాగాలనే బలమైన కోరికలు తనను ఎలా చుట్టుముట్టాయో ఈ యువనటి వెల్లడించారు. ఇది కేవలం ఒక సెలబ్రిటీ గాసిప్ మాత్రమే కాదు.. సమాజంలో చాలామంది తెలియకుండానే మద్యంపై ఆధారపడటానికి అలవాటు పడతారని జాన్వీ తెలిపారు. తను ఎదుర్కొన్న ఒక తీవ్రమైన బాధాకరమైన అనుభవం తర్వాత..ఆ మానసిక వేదన నుండి తప్పించుకోవడానికి మద్యం ఒక మార్గంగా మారిందని తెలిపారు. సామాజిక వినోదం కోసం తాగడం వేరు.. కానీ మానసిక ప్రశాంతత కోసం మద్యంపై ఆధారపడటం అనేది ప్రమాదకరమైన మలుపు అని తన అనుభవాన్ని జాన్వీ చెప్పుకొచ్చారు. మద్యానికి బానిస కావడం అనేది ఒకేసారి జరగదని, అది చాలా నిశ్శబ్దంగా మన అలవాట్లలోకి ప్రవేశిస్తుందని జన్వీ వెవరించారు. తాను పూర్తిగా వ్యసనపరురాలిని కాకపోయినా.. పదేపదే తాగాలనే ఆలోచన కలగడం తనను ఆందోళనకు గురిచేసిందని పేర్కొన్నారు.

## లిక్కర్ చూస్తే నాలుక రుచి మరిగేది



## వారే నా దిక్కు: మలైకా అరోరా



ఫిట్‌నెస్ ఐకాన్, నటి మలైకా అరోరా వ్యక్తిగత జీవితం - వృత్తిపరమైన విషయాలు ఎంతో ఓపెన్ గా పంచుకుంటారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎప్పుడైనా జీవితంలో ఏదైనా సంక్షోభం ఎదురైతే ఎవరి సహాయం కోరుకుంటాను అనే విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కష్ట సమయాల్లో అండగా నిలిచే వ్యక్తులు జీవితంలో ఎంత ముఖ్యమో మలైకా ఈ సందర్భంగా చెప్పే ప్రయత్నం చేసారు. మలైకా తన జీవితంలో కుటుంబానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు మొట్టమొదట సంప్రదించేది తన కుటుంబాన్నే అన్నారు. ముఖ్యంగా తల్లి జాయిస్ పాలీకార్ప్ - సోదరి అమృతా అరోరా తనకు కొండంత అండగా ఉంటారన్నారు. వారితో ఉన్న అనుబంధం తనను మానసికంగా ఎంతో దృఢంగా మారుస్తుందని చెప్పుకొచ్చారు. రక్త సంబంధీకులు ఇచ్చే ధైర్యం మరేదీ ఇవ్వలేదని అభిప్రాయపడ్డారు. కుటుంబంతో పాటు తన ప్రాణ స్నేహితులైన కరీనా కపూర్ ఖాన్ - కరిష్మా కపూర్ గురించి కూడా మలైకా ప్రత్యేకంగా ప్రస్తావించారు. వీరిద్దరూ తన జీవితంలో విడదీయలేని భాగమని, ఏ చిన్న ఆపద వచ్చినా వెన్నంటే ఉంటారని గర్వంగా చెప్పారు.

## జైలర్-2లో మేఘనారాజ్



నటి మేఘనా రాజ్ 'బెండు అప్పారావు ఆర్ఎమ్‌పీ' సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చింది. అల్లరి నరేష్ సరసన హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఆ తర్వాత కన్నడ, మలయాళ చిత్రాల్లో రాణించింది. కెరీర్ బాగున్న సమయంలోనే కన్నడ నటుడు చిరంజీవి సర్జాను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే, విధి ఆడిన వింత నాటకంలో ఆమె భర్త చిరంజీవి సర్జా గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఆ సమయంలో మేఘనా గర్భవతి. భర్త మరణం తర్వాత కొడుకు పుట్టిన వేళ.. ఆ బిడ్డలోనే తన భర్తను చూసుకుంటూ ఆమె ధైర్యంగా ముందుకు సాగుతోంది. అడపా దడపా సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. తాజాగా మేఘనా రాజ్ సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసింది. సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా రాబోతున్న బ్లాక్ బస్టర్ సీక్వెల్ 'జైలర్-2'లో ఆమె ఒక కీలక పాత్రలో నటించే అవకాశం దక్కించుకుంది. ఈ విషయాన్ని తన వెడ్డింగ్ యానివర్సరీ సందర్భంగా ప్రకటిస్తూ, రజినీకాంత్‌ను కలిసిన ఫోటోలను పంచుకుంది.

## మే 8న ఓటీటీలోకి డెకాయిట్




టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన లేటెస్ట్ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. భారీ అంచనాల మధ్య ఏప్రిల్ 10న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని అందుకోవడమే కాకుండా ప్రేక్షకులను, విమర్శకులను సైతం మెప్పించింది. థియేటర్లలో సందడి చేసిన నెల రోజులకే ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. 'డెకాయిట్' డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో భారీ ధరకు సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా మే 8 నుంచి ఓటీటీలో అందుబాటులోకి రానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కూడా ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు అధికారిక ప్రకటన వచ్చేసింది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన వారు లేదా మరోసారి ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారు మే 8 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో చూడొచ్చు. అడివి శేష్ నుంచి వచ్చిన ఈ పవర్‌ఫుల్ 'డెకాయిట్' కథ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా అదే స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.




# మిట్టల్ చేతికి రాజస్థాన్ రాయల్స్

ఐపీఎల్ ఫ్రాంఛైజీ రాజస్థాన్ రాయల్స్ యాజమాన్య హక్కులు మరోసారి చేతులు మారనున్నాయి. భారత్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మి ఎన్.మిట్టల్ కుటుంబం రాయల్స్ జట్టును కొనుగోలు చేసింది. మరో ప్రముఖ వ్యాపారవేత్త అదర్ పూనావాలాతో కలిసి ఈ ఫ్రాంచైజీని సొంతం చేసుకుంది. మొత్తంగా రూ. 15,600 (1.65 బిలియన్ డాలర్లు) రికార్డు బిడ్‌తో ఈ ఒప్పందం ఖరారైంది. ఇది వరకు రాజస్థాన్ రాయల్స్ జట్టు కోసం అమెరికాకు చెందిన కాల్ సోమాని, రాబ్ వాల్టన్‌తో కూడిన కన్సార్టియం వేసిన 1.63 బిలియన్ డాలర్ల బిడ్ సాంకేతిక, ఇతర కారణాల వల్ల విఫలమైంది. దాంతో మిట్టల్ కుటుంబం రేసులోకి వచ్చి ఆర్ఆర్ ఫ్రాంచైజీని దక్కించుకుంది. ఈ లావాదేవీలో ఐపీఎల్‌లో రాజస్థాన్ పురుషుల జట్టుతోపాటు దక్షిణాఫ్రికాలోని పార్ల్ రాయల్స్, కరేబియన్ ప్రీమియర్ లీగ్ జట్టు బార్బడోస్ రాయల్స్ కూడా ఉన్నాయి. తాజా ఒప్పందం ప్రకారం మిట్టల్ కుటుంబం 75 శాతం.. అదర్ పూనావాలా 18 శాతం వాటాను సొంతం చేసుకోగా, మిగిలిన 7 శాతం మనోజ్ బడాలెతో పాటు ప్రస్తుత వాటాదారుల వద్ద ఉంటుంది. కొత్తగా ఏర్పాటు చేసే రాజస్థాన్ రాయల్స్ బోర్డులో లక్ష్మి మిట్టల్, ఆయన కుమారుడు ఆదిత్యతో పాటు పూనావాలా, మనోజ్ బడాలె తదితరులు సభ్యులుగా కొనసాగుతారు. ఈ లావాదేవీలు పూర్తి చేసేందుకు బీసీసీఐ, సీసీఐ, ఐపీఎల్ పాలక మండలి అమోదం తప్పనిసరి. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలోగా జట్టు యాజమాన్య హక్కుల బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్వాహకులు భావిస్తున్నారు.



# గంధె నిత్య నేషనల్ రికార్డు

ప్రపంచ అథ్లెటిక్స్ రిలేస్ టోర్నమెంట్‌లో తెలంగాణ అమ్మాయి గంధె నిత్యతో కూడిన భారత జట్టు నాలుగు 100 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. నిత్య, రాహుల్ కుమార్, అనిమేష్ కుజుర్, స్నేహ ఎస్.ఎస్.తో కూడిన భారత్ ఆదివారం జరిగిన ఈ రేసును 41.35 సెకన్లలో పూర్తి చేసింది. దాంతో మార్చిలో నమోదైన 42.30 సెకన్ల పాత రికార్డును బద్దలు కొట్టింది. అయితే, ఈ సమయం ఫైనల్స్‌కు చేరుకోవడానికి సరిపోకపోవడంతో భారత జట్టు తమ హీట్‌లో ఆరో స్థానంలో, ఓవరాల్‌గా పదో స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# సన్‌రైజర్స్‌కు షాక్

## సొంత మైదానంలో ఓటమి
## కోల్‌కతా ఘన విజయం



**ఐపీఎల్-2026లో వరుస విజయాలతో దూసుకుపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కోల్‌కతా నైట్‌రైడర్స్ షాకిచ్చింది. ఉప్పల్ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్‌పై 7 వికెట్ల తేడాతో కేకేఆర్ ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 166 పరుగుల లక్ష్యాన్ని కోల్‌కతా కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 18.2 ఓవర్లలో ఛేధించింది.**

**కేకేఆర్ బ్యాటర్లలో అంగక్రిష్ రఘువంశీ(59) హాఫ్ సెంచరీతో సత్తాచాటగా.. కెప్టెన్ అజింక్య రహానే(43), ఫిన్ అలెన్(29), రింకూ సింగ్(22 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. హైదరాబాద్ బౌలర్లలో షకీబ్, కమ్మిన్స్, శివాంగ్ కుమార్ తలా వికెట్ సాధించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌హెచ్ 19 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది.**

ఓ దశలో 105/2తో పటిష్టంగా కన్పించిన సన్‌రైజర్స్ కేవలం 60 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు కోల్పోయింది. కేకేఆర్ బౌలర్లలో కేకేఆర్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి మూడు వికెట్లు పడగొట్టగా.. త్యాగీ, నరైన్ తలా రెండు వికెట్లు సాధించారు. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో ట్రావెస్ హెడ్(61), ఇషాన్ కిషన్(42) మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. ఈ ఏడాది సీజన్‌లో సన్‌రైజర్స్ ఆలౌట్ కావడం ఇదే తొలిసారి.

### నా వల్లే ఈ ఓటమి: పాట్ కమిన్స్

బ్యాటింగ్ వైఫల్యంతో పాటు తన చెత్త బౌలింగ్ తమ ఓటమిని శాసించిందని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు. బ్యాటింగ్‌లో 20-30 పరుగులు అదనంగా చేసినా.. తాను ఒకే ఓవర్‌లో 27 పరుగులు ఇవ్వకున్నా మ్యాచ్ ఫలితం మరోలా ఉండేదని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఆదివారం ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన సన్‌రైజర్స్ హైదరాబాద్ 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. వరుసగా 5 విజయాల తర్వాత ఆరెంజ్ ఆర్మీ ఓటమి చవిచూసింది. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన పాట్ కమిన్స్.. తన వల్లే ఓటమి ఎదురైందని చెప్పాడు. 'ఈ రోజు మాకు కలిసి రాలేదు. మేం చాలా మంచి ఆరంభాన్ని అందుకున్నాం. కానీ ఆ తర్వాత పూర్తి స్థాయిలో రాణించలేకపోయాం. మాకు లభించిన ఆరంభాన్ని బట్టి మేం కనీసం 180-200 ప్లస్ స్కోర్ చేయాల్సింది. కానీ అది సాధ్యం కాలేదు. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేయలేకపోయాం. ఈ వికెట్‌పై 180 పరుగుల లక్ష్యం మంచి స్కోర్ అవుతుందని నేను భావించాను. ప్రత్యర్థి



ఆటగాళ్లకు తగ్గట్లు మేం వ్యూహాలను బాగానే రచించాం. కానీ మ్యాచ్ సెకండాఫ్‌లో కీలక క్షణాలను సద్వినియోగం చేసుకోలేకపోయాం. ఇందులో నా తప్పు కూడా ఉంది. 180 పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎందుకంటే పిచ్ కొద్దిగా పొడిగా మారి నెమ్మదించింది. 180 ప్లస్ పరుగులు చేసి ఉండాల్సింది. వరుసగా ఐదు మ్యాచ్‌ల తర్వాత ఓడాం. అయితే ఈ మ్యాచ్‌లో కూడా స్వల్ప తేడాతో విజయాన్ని చేజార్చుకున్నాం. ఈ మ్యాచ్‌లో ఓడినా మాకు సానుకూల అంశాలు చాలా ఉన్నాయి. మా బౌలింగ్ విభాగంతో మ్యాచ్‌ను చివరి వరకు లాక్కొచ్చాం. నా ఓవర్‌లో 27 పరుగులు ఇవ్వడం మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపింది. కాబట్టి ఇలాంటి చిన్న చిన్న క్షణాలే పెద్ద మార్పును సృష్టిస్తాయి.'అని పాట్ కమిన్స్ పేర్కొన్నాడు.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 9 | 6 | 2 | 13 |
| బెంగళూరు | 9 | 6 | 3 | 12 |
| హైదరాబాద్ | 10 | 6 | 4 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 12 |
| చెన్నై | 9 | 4 | 5 | 8 |
| ఢిల్లీ | 9 | 4 | 5 | 8 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 7 |
| ముంబై | 9 | 2 | 7 | 4 |
| లక్నో | 8 | 2 | 6 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

# సీఎస్‌కేకు గాయాల బెడద

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న సీఎస్‌కేకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సీజన్ ప్రారంభానికి ముందు నుంచే వేధిస్తున్న గాయాల సమస్య ఆ జట్టును మరోసారి గట్టి దెబ్బేసింది. గత మ్యాచ్‌లోనే (ముంబై ఇండియన్స్) అరంగేట్రం చేసిన ఆల్‌రౌండర్ రామకృష్ణ ఘోష్ తన తొలి మ్యాచ్‌లోనే గాయపడి సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ మ్యాచ్‌లో ఘోష్ కుడి పాదానికి ఫ్రాక్చర్ అయ్యింది. ఘోష్ సీజన్ మొత్తానికి దూరమైన విషయాన్ని సీఎస్‌కే యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. ఘోష్ తన తొలి మ్యాచ్‌లోనే ఓ మోస్తరు ప్రదర్శన చేసి ఆకట్టుకున్నాడు. 3 ఓవర్లలో 24 పరుగులిచ్చి కీలకమైన సూర్యకుమార్ యాదవ్ వికెట్ తీశాడు. ఈ వికెట్‌కు ముందే ఘోష్ అందరి మన్ననలు అందుకున్నాడు. విల్ జాక్స్‌ను ఔట్ చేయడానికి అతను పట్టిన అద్భుతమైన డైవింగ్ క్యాచ్ మ్యాచ్ మొత్తానికే హైలైట్‌గా నిలిచింది. వాస్తవానికి ఘోష్ తన తొలి బంతికే గాయపడ్డాడు. ఫాలో త్రూలో అతని కాలు మెలిక పడినట్లు క్లియర్‌గా తెలిసింది. అయినా అతను మరో 17 బంతులు బౌలింగ్ చేశాడు. 20 ఓవర్ల పాటు ఫీల్డింగ్ కూడా చేశాడు. తొలి మ్యాచ్‌లోనే మంచి ఇంప్రెషన్ తెచ్చుకున్న ఘోష్ అదే మ్యాచ్‌లో గాయపడటం దురదృష్టకరం. ఈ మ్యాచ్‌లో సీఎస్‌కే ముంబైపై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.



# సుందర్ సిక్సర్


## గుజరాత్‌ను గెలిపించిన ఆల్ రౌండర్.. పోరాడినా ఓడిన పంజాబ్

ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో పంజాబ్‌పై గుజరాత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో మరో బంతి మాత్రమే మిగిలుండగా వాషింగ్టన్ సుందర్ (40 నాటౌట్) సిక్సర్ బాది గుజరాత్‌ను గెలిపించాడు. అంతకుముందు సాయి సుదర్శన్ (57) అర్ధ సెంచరీతో రాణించి, గెలుపుకు పునాది వేశాడు. అయితే గుజరాత్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి లోనైంది. దీంతో సునాయాసంగా గెలవాల్సిన మ్యాచ్ చివరి ఓవర్ వరకు సాగింది. ఈ మధ్యలో పంజాబ్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. బార్ట్‌లెట్ (4-0-38-2), అర్షదీప్ సింగ్ (4-0-24-2), జన్సెన్ (4-0-33-1), విజయ్ కుమార్ (4-0-31-2) తమ పాత్రలకు న్యాయం చేశారు. ఆఖరి ఓవర్ వేసిన స్టోయినిస్ (2.5-0-26-1) లక్ష్యాన్ని కాపాడలేకపోయాడు. ఈ ఓవర్‌లో ఓ ఫోర్, ఓ సిక్సర్ వచ్చింది. గుజరాత్ ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ (5), నిషాంత్ సంధు (15), తెవాతియా (2), హోల్డర్ (2) తక్కువ స్కోర్లకే ఔట్ కాగా.. బట్లర్ (26) ఓ మోస్తరు స్కోర్ చేశాడు. ఆఖరి ఓవర్ తొలి బంతికి అర్షద్ ఖాన్ (8 నాటౌట్) బౌండరీ బాది లక్ష్యానికి చేరువ చేశాడు. అంతకుముందు పంజాబ్ పడుతూ లేస్తూ చివరికి గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది. సూర్యాంశ్ షేడ్గే (57), మార్కస్ స్టోయినిస్ (40), ఆఖర్లో మార్కో జన్సెన్ రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. గుజరాత్ బౌలర్లలో జేసన్ హోల్డర్ (4-0-24-4) పంజాబ్‌ను భారీ దెబ్బకొట్టాడు. తొలుత సిరాజ్ (4-0-28-2), రబాడ (4-1-22-2) కూడా పంజాబ్‌ను కష్టాల్లోకి నెట్టారు. మిగతా బౌలర్లలో రషీద్ ఖాన్ (4-0-32-1) పర్వాలేదనిపించగా.. మానవ్ సుతార్ (1-0-27-0), అర్షద్ ఖాన్ (3-0-29-0) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. పంజాబ్ ఇన్నింగ్స్‌లో ప్రియాంశ్ ఆర్య 2, ప్రభ్‌సిమ్రన్ 15, కూపర్ కన్నోల్లీ డకౌట్, శ్రేయస్ అయ్యర్ 19, నేహల్ వధేరా, జేవియర్ బార్ట్‌లెట్ డకౌటయ్యారు. విజయ్ కుమార్, అర్షదీప్ తలో పరుగుతో అజేయంగా నిలిచారు.



# మనీశ్ పాండే, నరైన్ రికార్డులు

కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) వెటరన్ బ్యాటర్ మనీష్ పాండే, స్పిన్ మాయామాంత్రికుడు సునీల్ నరైన్ చరిత్ర సృష్టించారు. ఐపీఎల్ చరిత్రలోనే 19 సీజన్లు ఆడిన మూడో బ్యాటర్‌గా మనీశ్ పాండే నిలిచాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాత్రమే ఈ ఫీట్ సాధించగా.. మనీష్ పాండే తాజాగా ఈ జాబితాలో చేరాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఉప్పల్ వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా మనీష్ పాండే ఈ ఫీట్ సాధించాడు. ఈ సీజన్‌లో మనీష్ పాండేకు ఇదే తొలి మ్యాచ్. కేకేఆర్ రెగ్యులర్ ప్లేయర్ రమణ్‌దీప్ సింగ్ స్థానంలో మనీష్ పాండే తుది జట్టులోకి వచ్చాడు. ఐపీఎల్‌లోని 19 సీజన్లలో మనీష్ పాండే కనీసం ఒక్క మ్యాచ్ ఆడాడు. అరంగేట్ర సీజన్ 2008లో ముంబై ఇండియన్స్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన మనీష్ పాండే.. ఆ మరుసటి ఏడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జట్టుకు మారాడు. ఐపీఎల్ 2010లో కూడా ఆ జట్టుకే ఆడాడు. ఐపీఎల్ 2011లో మాత్రం పుణె వారియర్స్ ఇండియాకు ఆడిన మనీష్ పాండే 2013 వరకు ఆ జట్టులోనే కొనసాగాడు. 2014లో కేకేఆర్ జట్టులో చేరి 2017 వరకు కొనసాగాడు. కేకేఆర్ టైటిల్ గెలిచిన 2014 సీజన్‌లో ఫైనల్లో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. ఐపీఎల్ 2018లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో చేరి 2021 వరకు ఆ జట్టు తరఫునే ఆడాడు. ఐపీఎల్ 2022 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్, ఐపీఎల్ 2023లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో కేకేఆర్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన మనీష్ పాండే.. అప్పటి నుంచి ఆ జట్టులోనే కొనసాగుతున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో ఒకే ఒక్క మ్యాచ్ ఆడిన మనీష్ పాండే.. ఐపీఎల్ 2025 సీజన్‌లో మూడు మ్యాచ్‌లు ఆడాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 4-5-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## నవ భారతావనికి దిశానిర్దేశం నేటి తీర్పు

ప్రజాస్వామ్య పండుగలో అత్యంత కీలక ఘట్టం ముగిసింది. కోట్లాది మంది ఓటర్లు తమ భవిష్యత్తును బ్యాలెట్ పెట్టెల్లో నిక్షిప్తం చేశారు. మే 4న వెలువడనున్న ఫలితాలు కేవలం ఏ పార్టీ గెలిచింది? ఎవరు ప్రధాని పీఠాన్ని అధిష్టించబోతున్నారు? అనే అంశాలకే పరిమితం కావు. ఇవి రాబోయే దశాబ్ద కాలంలో భారతదేశ గమనాన్ని, ఆర్థిక వ్యవస్థను, సామాజిక సమతుల్యతను శాసించబోయే సంకేతాలు.గత కొన్నేళ్లుగా దేశం వివిధ సవాళ్లను ఎదుర్కొంటోంది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి దేశీయ సమస్యలతో పాటు, మారుతున్న ప్రపంచ రాజకీయ సమీకరణాల్లో భారత్ తనదైన ముద్ర వేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో రాబోయే ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలతోనే కాకుండా, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. మే 4 తీర్పు ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టడమే కాకుండా, పాలకులకు ఒక స్పష్టమైన మార్గదర్శిగా నిలవనుంది. స్థిరమైన ప్రభుత్వం ఏర్పడితేనే విదేశీ పెట్టుబడులు రావడం, మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కావడం సాధ్యమవుతుంది. అదే సమయంలో, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, అన్ని వర్గాలను కలుపుకొని పోయే సమగ్ర అభివృద్ధి నేటి తక్షణ అవసరం. ఓటరు తీర్పు అభివృద్ధికి పట్టం కడుతుందా? లేక మార్పును కోరుకుంటుందా? అన్నది పక్కన పెడితే, వచ్చే ఫలితాలు మాత్రం దేశాన్ని ఒక సరికొత్త దిశగా నడిపిస్తాయనడంలో సందేహం లేదు. ప్రజలు తమ బాధ్యతను నిర్వర్తించారు. ఇప్పుడు బాధ్యత రాజకీయ పార్టీలది. గెలుపోటములను హుందాగా స్వీకరించి, దేశ హితమే పరమావధిగా పనిచేసే నాయకత్వం కోసం భారత్ వేచి చూస్తోంది. మే 4 కేవలం ఒక తేదీ కాదు, అది నవ భారత నిర్మాణానికి పునాది రాయి కావాలి.

# నరకాసుర ఉనికి ఏమిటి?



దీపావళి... వెలుగు దివ్వెల పండుగ.. చీకట్లను తొలగించి వెలుతురు పూలను వికసింపజేసిన పండుగ. అమావాస్య అంధకారం సైతం పండు వెన్నెలలను పంచే పండుగ.. తెలతెలవారుతూనే హారతులతో ప్రారంభమై.. చీకట్లలో టపాకాయల మిరుమిట్లలో ప్రపంచం పగలుగా మారిన ఒక అపురూపమైన రాత్రిని చూసే ఒక అద్భుతమైన సన్నివేశం.. ప్రపంచంలోనే ఇంత అద్భుతమైన పర్వదినం మరొకటి లేదు.. రాదు.. ఇంత గొప్ప పండుగ మొట్టమొదటి సారి ఎక్కడ జరిగిందో మీకు తెలుసా? ఏ కారణంతో జరిగిందో తెలుసా? మనందరికీ తెలిసిన నరకాసుర వధ జరిగిన ప్రదేశం మనదేశంలోనే ఉంది. నరకాసురుడి సామ్రాజ్యం.. అతని వంశస్థులు పరిపాలించిన రాజ్యం.. ఇప్పుడు భారతదేశానికి తూర్పుద్వారంగా విలసిల్లుతోంది. ఇప్పటికీ నరకుడి జాతి ఉంది.



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 9052116463

నరకాసురుడి ఉనికి ఏమిటి? అన్నది మన తరానికి తెలియని అరుదైన చరిత్ర. నరకాసురుడి రాజ్యం మనకు ఇవాళికీ కనిపిస్తోంది.. మన దేశంలోనే ఈశాన్య భారత దేశం నరకాసురుడి సామ్రాజ్యం.. నరకుడు ఏలిన కిరాట రాజ్య రాజధాని ప్రాగ్జ్యోతిషపురం ఇవాల్టి గౌహతి.. భారత దేశానికి తూర్పున ముఖద్వారం.. మహాభారత కాలం నాటి అనేక నాగరికతలు అంతరించిపోయినా, నరకుడి ఆనవాళ్లు మాత్రం ఇప్పటికీ సజీవంగానే మనకు కనిపిస్తున్నాయి. ప్రాగ్యోతిష పురం.. క్రీస్తుపూర్వం 3200 సంవత్సరంనాటి రాజ్యం.. మహాభారత కాలం నాటి రాజ్యాలలో కిరాట రాజ్యం ఒకటి. దాని రాజధానే ఈ ప్రాగ్జోతిషపురం. అదే ఇవాల్టి అసోం రాజధాని. బహ్మపుత్రా నదీతీరంలో భారతదేశానికి ఈశాన్యాన ఉన్న గేట్వే. ఇవాళ గౌహతి వేగంగా అభివృద్ధి చెందుతున్న అత్యద్భుతమైన వాణిజ్య నగరం. సామాజిక, మత, సాంస్కృతిక, పారిశ్రామిక, రాజకీయ పరంగా అన్ని విధాలా పురోగమిస్తున్న ప్రాంతం. ఈ గౌహతి నగరమే ఒకనాటి నరకుడి రాజధాని. దీన్ని కమరూప నగరంగా కూడా పిలుస్తారు. ఇక్కడ నరకుడి ఆనవాళ్లు.. కిరాట రాజ్యపు శిథిలాలు ఇవాల్టికీ మనకు కనిపిస్తాయి. ప్రఖ్యాత కామాఖ్యదేవి ఆలయ సమీపంలోనే నాటి ప్రాగ్జ్యోతిషపురం అభివృద్ధి చెందింది. నీలాంచల్ హిల్స్ సమీపంలో దొరికిన రాగి పళ్లాలు.. శాసనాలు నరకుడు ఇక్కడ రాజ్యమేలిన విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ఈ నరకుడే శ్రీకృష్ణుడికి నిద్ర లేకుండా చేసాడు.. అతని మధుర నుంచి వేల మంది గోపికలను అపహరించుకొని వెళ్లినవాడు.. అరాచకానికి కేరాఫ్ అడ్రస్.. ఇతణ్ణి సంహరించటం ఎవరి వల్లా కాలేదు.. ఇతనికి తన తల్లి తప్ప ఎవరి చేతుల్లోనూ చనిపోకుండా వరం పొందిన వాడు.. దీంతో అతణ్ణి సంహరించటం ఎవరికీ సాధ్యం కాలేదు.

చివరకు శ్రీకృష్ణుడు భూదేవీ రూపమైన సత్యభామాదేవిని వెంటబెట్టుకుని వెళ్లి నరకాసుర వధ చేయాల్సి వచ్చింది. నరకుడి చావుతో చీకట్లు తొలిగిపోయాయి. వెలుగులు విరజి మ్మాయి. శ్రీకృష్ణుడితో నరకాసురుడి యుద్ధం జరిగిన ప్రదేశం గౌహతిలోనే ఉంది. గౌహతిలోని నీలాంచల్ హిల్స్ సమీపంలోనే ఈ యుద్ధం జరిగింది. అతణ్ణి హతమార్చిన తరువాత ప్రజలు ఆనందంగా దీపావళి సంబరాలను జరుపుకున్నది ఈ నీలాంచల్ హిల్స్ లోనే. ఇక్కడే అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన కామాఖ్య దేవాలయం ఉంది.. అతి శక్తిమంతమైన మహాశక్తి పీఠం. దక్షయజ్ఞంలో సతీదేవి మృతి తరు వాత ఖండఖండాలైన ఆమె మృతదేహం భాగాలలో యోని భాగం ఈ పర్వతంపై పడి శక్తిపీఠంగా ఆవిర్భవించింది. నరకుడు ఈ అమ్మవారిని మాతృశ్రీగా భావించి పూజించేవాడట. ఆలయాలు ఏవీ లేని కాలంలో కొండపై వెలసిన కామాఖ్యదేవి అతనికి ఆరాధ్యదైవమైంది. నరకుడు ఎంత కాముకుడో.. ఎంత కిరాతకుడో.. తల్లిపై అంతకంటే ఎక్కువ ప్రేమ ఉన్నవాడు. అందుకేనేమో.. తల్లి చేతిలోనే మరణాన్ని కోరుకున్నాడు.. అలాగే మరణించాడు.. కామాఖ్య దేవాలయం అష్టాదశ శక్తిపీఠాల్లో చాలా ముఖ్యమైంది.. ఈ ఆలయం కేంద్రంగానే కిరాట రాజ్యం మనుగడ సాగించింది. నరకాసురుడి అనంతరం అతని వంశస్థులు కొన్ని వందల సంవత్సరాల పాటు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. మహాభారత యుద్ధంలో కూడా వీళ్లు పాల్గొన్నారు.

అసోం ప్రాంతంలో మనం చూస్తున్న గౌహతి నగరం చుట్టుపక్కల కొండప్రాంతాలే ఒకనాటి అసుర మహాసామ్రాజ్యానికి ఆటపట్టు. కిరాట జాతులు ఇక్కడ తమ రాజ్యాన్ని అభివృద్ధి చేసుకున్నవి. పురాతత్వ శాస్త్రవేత్తల కథనం ప్రకారం ఇప్పుడు బోడో జాతి ప్రజలు నాటి కిరాట జాతికి చెందిన వారే. వీరంతా పసిఫిక్ మహాసముద్ర తీరం నుంచి ఈ ప్రాంతానికి వలస వచ్చిన వారు. మహేశ్వర్ నియోగ్ ఈశాన్య భారత ఎథ్నాలజీపై పరిశోధనలు చేసి తేల్చిన సత్యం ఇది. ఈశాన్య భారతానికి వచ్చిన వలసల విషయంలో కొన్ని మిథ్యావాదాలు లేకపోలేదు.. కానీ, మహేశ్వర్ నియోగ్ నిరూపించిన వాస్తవాల్లో కిరాటులు నరకుడి మూలపురుషులని తేలిపోయింది. బాణాసురుడు కూడా ఈ కిరాట వంశస్తుడేనని మరో కథనం ఉంది. శ్రీకృష్ణుడి మనవడైన అనిరుద్ధుడు ఈ బాణాసురుడి కుమార్తె ఉషను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అయితే బాణాసురుడికి సంబంధించిన రుజువులు ఇక్కడ కనపడలేదు. కానీ నరకాసురుడి చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు అనేకం అసోంలో కనిపిస్తున్నాయి. ఇతని మరణానంతరం ఇతని కుమారుడు భగదత్తుడు ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు..” భగదత్తుడు కురుక్షేత్ర యుద్ధంలో కౌరవుల పక్షాన పోరాటం చేసాడు. పాండవుల చేతిలో హతమయ్యాడు. అతని తరువాత మహిదానవుడు ఈ కిరాట రాజ్యాన్ని కలియుగం వరకు పరిపాలించాడు. వేద సంప్రదాయంతో సంబంధం లేని రాచరిక వంశాలు మహాభారత కాలంలో చాలా ఉన్నాయి. అసురులు ఈ వంశాల్లోని వారే. అసురులంటే ఒక కులానికో.. మతానికో చెందిన వాళ్లు కారు. ప్రజల్ని కిరాతకంగా హింసించే దానవ ప్రవృత్తి ఉన్న వాళ్లను అసురులుగా పిలిచారు. నరకుడు అలాంటి వాడే.. భూమి కడుపున పుట్టినప్పటికీ, దురాగత చర్యల వల్ల అసురుడయ్యాడు.

టిబెట్, బర్మా, మంగోలియాల నుంచి వలస వచ్చిన ట్రైబల్స్ నరకాసురుడి రాజ్యంలో భాగమయ్యారు. ఇక్కడ బోడో ప్రజల్లో ప్రచారంలో ఉన్న కథనం ప్రకారం నరకుడు వారి రాజ కుమారుడు. రాజ్యంలో తన తండ్రిపై కుట్ర జరగటంతో అతని తల్లి పొరుగున ఉన్న మగధకు పారిపోయి నరకుణ్ణి కన్నది. అతను అక్కడ 14 సంవత్సరాలు ఉన్నాడు. ఆ తరువాత తిరిగి ప్రాగ్జోతిషపురం అంటే ఇవాల్టి గౌహతికి వచ్చి తన రాజ్యాన్ని చేపట్టాడు. మగధ రాజు జరాసంధుడి ఇన్ఫ్లుయెన్స్ ఇతనిపై చాలా ఉన్నట్లు కనిపిస్తుంది. అందుకే శ్రీకృష్ణుడిపై అసాధారణ శత్రుత్వాన్ని ప్రదర్శించాడు. బహ్మపుత్రానదీ తీరంలో బోడోలాండ్ ఇవాళ అస్సాంకు కేంద్రస్థానం.. ఇవాళ బోడోలు తమకు స్వయంప్రతిపత్తి కావాలని పోరాడుతున్నారు. శ్రీకృష్ణుడి కాలం నుంచి ఢిల్లీకీ, గౌహతికి మధ్య నిరంతరంగా కొనసాగుతున్న యుద్ధానికి ఇది ఉదాహరణ. గౌహతి ప్రాగ్జోతిషపురమే కాదు.. దీనికి కామరూపనగర్ అని కూడా పేరుంది. కామరూపనగరాన్నే ప్రాగ్జోతిషపురంగా నరకుడు మార్చాడు. కామరూపనగరం అంటే ఏమిటి? ఎందుకు ఆ పేరు వచ్చింది..? గౌహతి నగరంలోని నీలాంచల్ హిల్స్లో కామాఖ్యాదేవి ఆలయం తాంత్రిక శక్తికి కేంద్రస్థానంగా చెప్పుకుంటారు.. దీనికి కొద్ది దూరంలోనే భువనేశ్వరీ దేవి ఆలయం వుంది.. ఇక్కడి నుంచి మరి కొంత దూరం వెళ్తే చిత్రాంచల్ కొండలపైన నవగ్రహదేవాలయం ఉంటుంది. ఈ ఆలయం ఖగోళ శాస్త్రాన్ని, జ్యోతిష శాస్త్రాన్ని అధ్యయనం చేసేందుకు అనువుగా.. ఆయా గ్రహాల కదలికలను తెలిపే విధంగా ఉండటం విశేషం. అన్నింటికీ మించి బ్రహ్మపుత్రా నది మధ్యలో నెమలి ద్వీపం ఉంది. ఇక్కడ ఉమానంద ఆలయాన్ని చూడటం ఒక అద్భుతం. అపురూపం. ఈ ప్రాంతమే గౌహతిని కామరూప నగరంగా పేరు పడేలా చేసింది. మహాశివుడు అన్నింటినీ వదిలేసి తపోదీక్షకోసం నెమలి ద్వీపానికి వచ్చాడట. ఇక్కడ ఆయన తపస్సులో ఉన్నప్పుడు పార్వతీదేవి ఆయన కోసం తపించింది.. ప్రార్థించింది.. వాళ్లిద్దరినీ కలిపేందుకు రతీమన్మథులు ప్రయత్నించారు. మన్మథుడి పూలబాణంతో తపోభంగం జరిగిన శివుడు త్రినేత్రాన్ని తెరిచి అతణ్ణి భస్మం చేశాడట. ఇదే ప్రదేశంలో ఉమానంద ఆలయం ఏర్పడింది. ఇక్కడ శివుడు స్వయంభువుగా వెలిశాడు.. అస్సాం వెళ్లిన వారికి ఇది పరమాద్భుతమైన ప్రదేశం. చుట్టూ ప్రవహించే నది.. మధ్యలో అందాల నెమలి దీవి.. ఈశాన్యభారతంలో ఇది తప్పనిసరిగా చూసి తీరాల్సిన చూడచక్కని ప్రదేశం. గౌహతి, ఈశాన్యభారత దేశంలో భారతకాలం నాటి చారిత్రక ఆనవాళ్లను సజీవంగా నిలిపి ఉంచిన అరుదైన నగరాల్లో ఒకటి. ఒక వైపు మగధ.. మరో వైపు మధుర.. రెండు మహాసామ్రాజ్యాలకు తూర్పు ఈశాన్యాలలో విస్తరించిన అసుర సామ్రాజ్యమిది.. దీపావళి సంబరాలు భారత దేశంలో మొట్టమొదటి సారి జరుపుకున్న దేశం ఇది. ఇది నరకుడి రాజ్యం. ఈనాటి బోడో తెగ ప్రజల మూలపురుషులు ఏలిన దేశమిది.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.